TS-11-0036701

నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక

సాధ్యం కాదనే భావనను
మనసులోంచి తొలగించుకోవడమే
విజయపథంలో వేసే
తొలి అడుగు
- టెన్నిసన్

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 67 గురువారం, నవంబర్ 05, 2026 , పేజీలు - 12 వెల : 2/-



తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్!

- దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా తెలంగాణ కులగణనను ప్రామాణికంగా తీసుకుంది

హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర మరువలేనిది

శ్రీకృష్ణ సదర్ ఉత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలి: బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్





హైదరాబాద్,నవంబర్ 4 : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ కులగణనను ప్రామాణికంగా తీసుకుందని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. మిగతా2లో...

తెలంగాణకు 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం!

డీప్‌టెక్ రంగంలో ప్రపంచస్థాయి కేంద్రంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం.. పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెరగాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,నవంబర్ 4 : తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయలో బుధవారం నిర్వహించిన ఫిక్కీ శతాబ్ది వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.రాష్ట్రంలో ఐటీ, ఔషధాలు, జీవసాంకేతికత, మిగతా2లో...

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

చట్టం అమలుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు!


పర్యవేక్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి సూచన.. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు చర్యలు



ట్రంప్ ఓటమిపై ప్రపంచ దేశాల స్పందన!

ఇరాన్ హర్షం.. రష్యా ఆచితూచి వ్యాఖ్యలు.. అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తామన్న చైనా





పరీక్షల సంస్కరణలపై నందన్ నీలేకనితో చంద్రబాబు చర్చలు

పేపర్ లీకేజీల నివారణకు సాంకేతికత వినియోగంపై దృష్టి

వరద సహాయక చర్యల్లో విషాదం..

11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గల్లంతు!

మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లి బేతపల్లి చెరువు అలుగు వద్ద బోట్లు బోల్తా



సత్తుపల్లి,నవంబర్ 4 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతపల్లి పెద్ద చెరువు వద్ద బుధవారం విషాదం చోటుచేసు కుంది. వరదలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన 11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రెండు బోట్లు బోల్తా పడటంతో తమ్మిలేరు వాగులో గల్లంతయ్యారు.చెరువు అలుగు వద్ద ఏడుగురు మత్స్యకారులు వరద ఉధృతికి చిక్కుకోగా, వారిని కాపాడేందుకు సిబ్బంది రంగంలోకి దిగారు. గల్లంతైన వారి కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. కలెక్టర్ దివాకర టీఎస్ మిగతా2లో...

ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు న్యాయం జరగదు!

● తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నాయకత్వాల ముందు తాకట్టు పెడుతున్నారు ● రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే కాంగ్రెస్, బీజేపీల ప్రాధాన్యం ● రేవంత్‌రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి.. కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్,నవంబర్ 4 : ఢిల్లీ పార్టీలతో తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరగబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నాయకత్వాల ముందు కాంగ్రెస్, బీజేపీలు తాకట్టు పెడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ సంచులు మోస్తే.. బీజేపీ చెప్పులు మోస్తోందని ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు అవుకు దామోదర్‌రెడ్డి మిగతా2లో...

క్రమశిక్షణ ఉల్లంఘనపై కాంగ్రెస్ అధిష్టానం గుర్రు!

ఢిల్లీ నిరసన సభకు గైర్హాజరైన నేతలపై ఆగ్రహం.. తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై వివరణ కోరిన ఏఐసీసీ

హైదరాబాద్,నవంబర్ 4 : ఢిల్లీలో నిర్వహించిన ఓట్ చోరీ వ్యతిరేక నిరసన సభకు గైర్హాజరైన తెలంగాణ కాంగ్రెస్ నేతల వ్యవహారంపై ఏఐసీసీ తీవ్రంగా స్పందించింది. అధిష్టానం ఆదేశించిన కార్యక్రమానికి హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అంశంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆదేశించింది.ఈ నెల 1న ఢిల్లీలోని మిగతా2లో...

తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవులను అన్ని విధాలుగా గౌరవిస్తోందని తెలిపారు. **హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకం** హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర వెలకట్టలేనిదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించామని గుర్తుచేశారు. ప్రస్తుతం గోల్కొండ కోట ఉన్న ప్రాంతం ఒకప్పుడు గొల్లం కొండగా ప్రసిద్ధి చెందిందని ప్రస్తావించారు. వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని చెప్పారు. నగర అభివృద్ధిలో వారి సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. **సదర్ ఉత్సవాలకు రూ.5 కోట్ల కేటాయింపు**సదర్ వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు కేటాయించిందని సీఎం వెల్లడించారు. మూసీ పునరుద్ధరణ, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు యాదవ సోదరులు సహకరించాలని కోరారు. **పశుసంపదతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ పశుసంపద అభివృద్ధి ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని అన్నారు. సదర్ ఉత్సవాల ద్వారా యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి పరిచయమవుతున్నాయని పేర్కొన్నారు. యాదవులు ఆర్థిక వ్యవస్థలో మరింత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. **జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి**బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని సామాజిక వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సామాజిక న్యాయం సాధించేందుకు జనాభా గణాంకాలు కీలకమని పేర్కొన్నారు.మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ సదర్ వేడుకలు సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. అంతరించిపోతున్న ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడమే సదర్ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు భారీగా తరలివచ్చారు. సదర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దున్నరాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు, మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు.

ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు న్యాయం జరగదు!

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.రాష్ట్ర ప్రయోజనాల కంటే కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టడంతో ఆయనకు ఢిల్లీలో ఉన్న గౌరవం ఏమిటో అర్థమైందని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి అని విమర్శించారు. ఢిల్లీ పర్యటనలతోనే పాలన సాగిస్తున్నారని ఆరోపించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కంటే చిన్నవాడైన అమిత్‌షా కాళ్లకు నమస్కరించాల్సిన పరిస్థితి రావడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని దిగజార్చడమేనని అన్నారు. అమిత్‌షా పర్యటన సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ బౌన్సర్‌లా వ్యవహరించారని విమర్శించారు. అమిత్‌షా తెలంగాణకు ఉత్త చేతులతో వచ్చి వెళ్లారని, రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా జాతీయ స్థాయి విద్యాసంస్థను తీసుకురాలేదని ప్రశ్నించారు.**ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం**కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టిందని, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై పగబట్టిందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. హైదరాబాద్‌లో మళ్లీ తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ హయాంలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని గుర్తుచేస్తూ.. రేవంత్‌రెడ్డి ఒక్క ఇందిరమ్మ ఇల్లయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. ఎన్నికల హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప పాలనపై సీఎం దృష్టి పెట్టడం లేదన్నారు.**మియాపూర్ భూముల విక్రయంపై ప్రశ్నలు** మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూముల విక్రయంపై రాష్ట్ర ప్రభుత్వానికి అంత తొందర ఎందుకని కేటీఆర్ ప్రశ్నించారు. తీర్పు వచ్చిన 24 గంటల్లోనే భూములు అమ్మేస్తామని సీఎం ప్రకటించడం వెనుక అంతర్యమేమిటని నిలదీశారు. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కమీషన్ల కోసం విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మియాపూర్ భూముల్లో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, హైదరాబాద్‌లోని పేదలకు స్థలాలు కేటాయించాలని కోరారు. హిల్ట్ పాలసీ పేరుతో కమీషన్ల వ్యవహారానికి తెరలేపారని, పరిశ్రమల కోసం కేటాయించిన విలువైన భూములను ప్రైవేటు ప్రయోజనాల కోసం విక్రయించడం దారుణమని విమర్శించారు.**విద్యుత్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు** కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేదని, జనరేటర్లు, ఇన్వర్టర్ల అవసరం తగ్గిపోయిందని కేటీఆర్ అన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌పై కేబినెట్ దృష్టి!

నేడు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం

పెట్టుబడులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

హైదరాబాద్,నవంబర్ 4 : తెలంగాణ మంత్రిమండలి సమావేశం గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. అంతకుముందు మధ్యాహ్నం 3 గంటలకు మంత్రుల తో సీఎం అనధికారికంగా సమావేశం కానున్నారు. ప్రధానంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లు, రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చించనున్నట్టు సమాచారం. వివిధ రంగాల్లో పెట్టుబడి ప్రతిపాదనలు, పరిశ్రమలకు భూకేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు అనుమతుల అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంపై ప్రభావం, తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్యలపైనా మంత్రిమండలి సమీక్షించనున్నట్టు తెలుస్తోంది. రైతుల ఇబ్బందులు, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగ నియామకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించే అవకాశం ఉంది.వివిధ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలు, పరిపాలనాపరమైన అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకోనుంది. సమావేశంలో వెలువడే నిర్ణయాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

కొడంగల్‌లో రైతు పండుగ.. మూడు రోజుల పాటు


మెగా రైతు మేళా!

- **నవంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహణ.. 150 ప్రదర్శన స్టాళ్లు..**

చివరి రోజు 50 వేల మంది రైతుల హాజరు



హైదరాబాద్,నవంబర్ 4 : రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు అధిక ఆదాయం ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలను పరిచయం చేసేందుకు కొడంగల్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు మెగా రైతు మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. నవంబర్ 7న ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేళాను ప్రారంభించనున్నారు. **150 ప్రదర్శన స్టాళ్ల ఏర్పాటు** మేళాలో 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో సుమారు 150 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, నూతన వ్యవసాయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు.**ఎల్‌నినో ప్రభావంపై అవగాహన** ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయంపై వాటి ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక చర్చలు జరగనున్నాయి. మొదటి రోజు సుమారు 7,500 మంది రైతులు పాల్గొననున్నారు. రైతులకు వ్యవసాయ యంత్రాలు, కస్టమ్ హైరింగ్ కేంద్రాలు, పప్పుధాన్యాల మిల్లులు, నూనె గానుగ యూనిట్లు, డ్రిప్ పరికరాలు అందించనున్నారు.రెండో రోజు మహిళా రైతులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరవుతారని అంచనా. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.



రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే!

- వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి

హైదరాబాద్,నవంబర్ 4 : రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో వచ్చే ఏడాదిలోగా సమగ్ర భూ సర్వే పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.భూముల రీ సర్వేను రైతుల సమక్షంలోనే పారదర్శకంగా నిర్వహించాలని సూచిం చారు. భూమి హద్దులు, విస్తీర్ణంలో తేడాలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతి భూ యజమానికి పక్కా వివరాలతో కూడిన భూ రికార్డులు, కొత్త పాస్‌బుక్కులు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.సర్వే జరిగే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు వారానికోసారి క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

న్యూఢిల్లీ,నవంబర్ 4 : బాల కార్మికుల నిషేధ చట్టం అమలును మరింత కఠినతరం చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బాల కార్మికుల (నిషేధం, నియంత్రణ) సవరణ చట్టం2016 అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు సంస్థలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు సూచించింది.జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 14 ఏళ్లలోపు పిల్లలను అన్ని రకాల వృత్తులు, పనుల్లో నియమించడాన్ని నిషేధించే ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొంది. **2009 నాటి పిటిషన్‌పై విచారణ** బాల కార్మికుల చట్టంలోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ 'హెల్ప్ ఫర్ మిలియన్స్' అనే స్వచ్ఛంద సంస్థ 2009లో పిటిషన్ దాఖలు చేసింది. పిల్లలకు విద్యా సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజనం కల్పించాలని కూడా కోరింది. 2016లో చట్ట సవరణతో పిటిషనర్ లేవనెత్తిన అంశాలు పరిష్కారమయ్యాయని కేంద్రం కోర్టుకు తెలిపింది. దీంతో పిటిషన్‌పై తదుపరి విచారణ అవసరం లేదని పేర్కొన్న ధర్మాసనం, సవరించిన చట్ట నిబంధనలను మాత్రం కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది.

వరద సహాయక చర్యల్లో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.**సహాయక చర్యలపై సీఎం ఆరా** ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. గల్లంతైన సిబ్బందిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సూచించారు.

ట్రంప్ ఓటమిపై ప్రపంచ దేశాల స్పందన!

న్యూఢిల్లీ,నవంబర్ 4 : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ల ఓటమిపై ప్రపంచ దేశాల నేతలు స్పందించారు. డెమోక్రాట్లు విజయం సాధించడాన్ని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ స్వాగతించారు. ట్రంప్ విధానాలకు అమెరికా ప్రజలు వ్యతిరేకంగా తీర్పునిచ్చారని వ్యాఖ్యానించారు.అమెరికా ఓటర్లు యుద్ధాన్ని తిరస్కరించారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘర్ గాలిబఫ్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఫలితాలతో అమెరికా విదేశాంగ విధానంలో తక్షణ మార్పులు వస్తాయని భావించలేమని రష్యా తెలిపింది.డెమోక్రాట్ల విజయం ఉక్రెయిన్‌కు మద్దతు, పర్యావరణ పరిరక్షణకు మేలు చేయవచ్చని యూరోపియన్ యూనియన్ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ఎన్నికలు ఆ దేశ అంతర్గత వ్యవహారమని చైనా పేర్కొంది. జపాన్, బ్రిటన్ కూడా అమెరికాతో తమ సంబంధాలు కొనసాగుతాయని స్పష్టం చేశాయి.

పరీక్షల సంస్కరణలపై నందన్ నీలేకనితో చంద్రబాబు చర్చలు

- పేపర్ లీకేజీల నివారణకు సాంకేతికత వినియోగంపై దృష్టి

అమరావతి, నవంబర్ 4 :
జాతీయ పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణలు తీసుకురావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పరీక్షల సంస్కరణల ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్ నందన్ నీలేకని చర్చించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో పారదర్శకమైన, నమ్మకమైన పరీక్షా విధానం రూపొందించాలని చంద్రబాబు సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించేలా విద్యా సంస్కరణలు ఉండాలన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని వివరించారు. పేపర్ లీకేజీల నివారణ, సైబర్ భద్రత, డిజిటల్ ఫోరెన్సిక్స్ బలోపేతంపై దృష్టి సారించినట్లు నీలేకని తెలిపారు.

తెలంగాణకు 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

అంతరిక్ష, విమానయాన రంగాలకు బలమైన పునాది ఉందని పేర్కొన్నారు. పరిశోధనశాలలకే పరిమితమవుతున్న ఆవిష్కరణలను ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, ధ్రువీకరణ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రయోగాత్మకంగా విజయవంతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృత స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ నిల్వ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయ రంగాల్లో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. **సాంకేతికతతో యువతకు ఉపాధి అవకాశాలు** సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణను ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, ఆధునిక పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా దేశీయంగా ఉత్పత్తులను అభివృద్ధి చేసి, ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. యువతకు నైపుణ్య శిక్షణ, పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.ఫిక్కీ వందేళ్ల ప్రస్థానాన్ని అభినందించిన భట్టి విక్రమార్క, రాష్ట్ర అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలని కోరారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

క్రమశిక్షణ ఉల్లంఘనపై కాంగ్రెస్ అధిష్టానం గుర్రు!

(మొదటి పేజీ తరువాయి)

రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన సభకు తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు తరలివెళ్లారు. అయితే మొత్తం 13 మంది ఎమ్మెల్యేలు సభకు గైర్హాజరైనట్లు టీపీసీసీ గుర్తించింది. వారిలో నలుగురు వ్యక్తిగత, కుటుంబ కారణాలతో ముందస్తు అనుమతి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన తొమ్మిది మంది ఎందుకు హాజరుకాలేదో వివరించాలని ఏఐసీసీ కోరింది. గైర్హాజరైన వారిలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు కూడా ఉన్నారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధిష్టానం స్పష్టం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

అశ్వారావుపేటను ముంచెత్తిన భారీ వర్షం!

కాలువలు కబ్జా - అక్రమ నిర్మాణాలతో నిలిచిన వరద నీరు.
రోడ్లపైకి పోటెత్తిన ప్రవాహం - ఇళ్లలోకి చేరిన నీరు.








చర్ల :- అశ్వారావుపేట పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అశ్వారావుపేట పట్టణం అతలాకుతలమైంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వరద నీరు పోటెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కడికక్కడ సహజ నీటి ప్రవాహ మార్గాలు, కాలువలు ఆక్రమణలకు గురికావడం, వాటిని పూడ్చివేసి అక్రమ భవనాలు నిర్మించడంతో వర్షపు నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక రహదారులపైకి, నివాస ప్రాంతాల్లోకి చేరుతోంది. దీంతో ప్రతి భారీ వర్షానికి పట్టణ ప్రజలు వరద ముప్పును ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

ఖమ్మం రోడ్డులోని పెరాయిగూడెం, పరిసర ప్రాంతాల నుంచి భారీగా చేరిన వర్షపు నీరు ఇళ్ల మధ్య నుంచి ఉధృతంగా ప్రవహిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. ముఖ్యంగా ఆంజనేయ వైన్ షాపు సమీపంలోని కల్వర్టు వద్ద నీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన మార్గం మూసుకుపోవడంతో వరద ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో నీరు రోడ్లపైకి చేరి రాకపోకలకు ఇబ్బందులు సృష్టించింది. ఇళ్ల మధ్య నుంచి ఉధృతంగా ప్రవహించిన నీటితో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

మరోవైపు భద్రాచలం రోడ్డులోని సంత మార్కెట్ ప్రాంతం పూర్తిగా జలమయమైంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరడంతో మార్కెట్ పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. పలువురి ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంత మార్కెట్ నుంచి దొంతికుంట చెరువు వరకు రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

దొంతికుంట చెరువుకు భారీగా వరద.. బైకిస్ట్ గల్లంతు కలకలం

దొంతికుంట చెరువులోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో చెరువు నిండుకుండలా మారింది. వరద ప్రవాహం చెరువు కట్టను దాటి రహదారిపైకి చేరుకోవడంతో భద్రాచలం రోడ్డులో రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఈ క్రమంలో వరద నీటిలో ఓ ద్విచక్ర వాహనదారుడు కొట్టుకుపోవడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి వరదలో చిక్కుకున్న వ్యక్తిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

చెరువుకు మరింత ఇబ్బంది కలగకుండా, వరద ఉధృతిని తగ్గించేందుకు అధికారులు అప్రమత్తమై దొంతికుంట చెరువు కట్టకు గండి కొట్టి నీటిని దిగువ ప్రాంతాలకు మళ్లించారు. దీంతో చెరువులో నీటి మట్టం తగ్గించేందుకు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ దిగువ ప్రాంతాల్లో వరద నీటి ప్రవాహం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కాలువల ఆక్రమణలే వరద ముంపునకు కారణమా?

పట్టణంలో వర్షాలు కురిసిన ప్రతిసారీ ఇదే తరహా పరిస్థితులు పునరావృతం కావడానికి ప్రధాన కారణం సహజ నీటి ప్రవాహ మార్గాలు కనుమరుగవడమేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గతంలో వర్షపు నీరు వెళ్లేందుకు ఉపయోగపడిన కాలువలు, వాగులు, నీటి మార్గాలు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయని, కొన్ని చోట్ల వాటిని పూడ్చివేసి నిర్మాణాలు చేపట్టడం వల్ల నీరు వెళ్లే దారి లేక రహదారులు, ఇళ్లను ముంచెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను సమగ్రంగా పరిశీలించి, ఆక్రమణలకు గురైన కాలువలను గుర్తించి పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఖమ్మం రోడ్డు, పెరాయిగూడెం పరిసర ప్రాంతాలు, ఆంజనేయ వైన్ షాపు సమీపంలోని కల్వర్టు, సంత మార్కెట్, దొంతికుంట ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతి వర్షాకాలంలో ప్రజలు వరద నీటితో ఇబ్బందులు పడకుండా పట్టణంలోని సహజ నీటి ప్రవాహ మార్గాలను కాపాడటంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ముంపు సమస్యలు తలెత్తకుండా శాశ్వత ప్రణాళిక రూపొందించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు.. వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దు
అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విజ్ఞప్తి.



చర్ల :-అశ్వారావుపేట. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. వర్షాల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలోని వాగులు, వంకలు, చెరువులు, కుంటల్లో నీటిమట్టం వేగంగా పెరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా ఎవరూ అనవసరంగా బయటకు రావద్దని, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో వాటిని దాటేందుకు ఏమాత్రం ప్రయత్నించవద్దని హెచ్చరించారు.

వరద ప్రవాహాన్ని తక్కువగా అంచనా వేయడం ప్రమాదకరమని పేర్కొన్నారు.

రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వరద ముప్పు పొంచి ఉన్నట్లయితే ఆలస్యం చేయకుండా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. పిల్లలు, వృద్ధుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

ప్రజలు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సంబంధిత అధికారుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కోరారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, భారీ వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తత వీడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు

మానవత్వాన్ని చాటుకున్న పవన్ కళ్యాణ్ సేవా సమితి.
కన్నీటి వీడ్కోలు పలికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించిన సేవా సమితి సభ్యులు.



చర్ల:-అశ్వారావుపేటఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే కాకుండా, ఆప్తులు లేని అనాథ మృతదేహానికి సైతం గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు పలికి పవన్ కళ్యాణ్ సేవా సమితి సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. అశ్వారావుపేటలోని అనాథాశ్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి మృతి చెందగా, అతనికి బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ సేవా సమితి సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించి గురువారం తమ ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.వర్షం కురుస్తున్నప్పటికీ వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా సేవా సమితి సభ్యులు ముందుకు వచ్చి మృతదేహానికి గౌరవప్రదంగా అంతిమ వీడ్కోలు పలికారు. ముందుగా మృతదేహానికి పూలమాల వేసి, నూతన వస్త్రాలను కప్పి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలకు సిద్ధం చేశారు. అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తరలించి చివరి కార్యక్రమాలను పూర్తి చేశారు.

సాధారణంగా మనిషి మరణించినప్పుడు కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులు అంతిమ సంస్కారాలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఎవరూ లేని అనాథ వ్యక్తి మరణించిన సమయంలో కూడా అతనికి గౌరవప్రదమైన వీడ్కోలు అందించాలనే ఆలోచనతో సేవా సమితి సభ్యులు ముందుకు రావడం పలువురి ప్రశంసలు అందుకుంది. మనిషి జీవించి ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, మరణించిన తర్వాత కూడా గౌరవం దక్కాలనే మానవతా విలువలను ఈ కార్యక్రమం చాటిచెప్పింది.ఈ కార్యక్రమంలో దేగల రాము, నాగబాబు నాయుడు, మాజీ వార్డు నంబర్ లక్ష్మణరావు, మానేపల్లి ఏసు, మీసాల శ్రీను, కొట్టే అనీల్ తదితరులు పాల్గొని అంత్యక్రియల నిర్వహణలో తమ వంతు సహకారం అందించారు.

అనాథ వ్యక్తి మృతదేహానికి ఎవరూ లేని పరిస్థితుల్లో ముందుకు వచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహించిన పవన్ కళ్యాణ్ సేవా సమితి సభ్యుల సేవాభావాన్ని స్థానికులు అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సాటి మనిషి పట్ల బాధ్యత, ఆప్యాయతలను మరింత పెంపొందిస్తాయని పలువురు పేర్కొన్నారు.

ప్రాణరక్షణే లక్ష్యంగా వర్షంలోనూ క్షేత్రస్థాయిలో పర్యటించిన డిప్యూటీ కలెక్టర్

మురసు తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురైన నెమిలిపేట గ్రామం.
బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడంలో ప్రత్యేక చొరవ.




చర్ల:-దమ్మపేటఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వరద ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మురసు తుఫాన్ ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్మపేట మండలం నెమిలిపేట గ్రామం ముంపునకు గురికావడంతో గ్రామ ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్, ట్రైనీ తహసిల్దార్ మద్దినేని మురళి స్వయంగా ముంపు ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ వెనుకడుగు వేయకుండా గ్రామంలోని పరిస్థితులను పరిశీలిస్తూ, వరద నీటి ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో నిమగ్నమయ్యారు.

ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ప్రాణాపాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, వారిని పునరావాస కేంద్రాలకు చేర్చేలా చర్యలు చేపట్టారు.

ముఖ్యంగా వర్షం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండటం, స్వయంగా ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యల్లో పాల్గొనడం స్థానికుల దృష్టిని ఆకర్షించింది. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి చూపిన చొరవను పలువురు అభినందిస్తున్నారు.ప్రజలకు కష్టం వచ్చినప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి భరోసా కల్పించడం ఎంతో అవసరమని, ఇలాంటి సమయాల్లో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించవచ్చని ఈ ఘటన తెలియజేస్తోంది.

వరద నీటిలో స్మశాన వాటిక

అంత్యక్రియలకు తీవ్ర ఆటంకం!
మృతదేహాలతో గంటల తరబడి వర్షంలోనే నిరీక్షణ.
మోకాళ్ల లోతు నీటిలో అంత్యక్రియలు.




చర్ల :- అశ్వారావుపేట.అశ్వారావుపేటలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది.అశ్వారావుపేటలో కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దొంతికుంట వరద నీరు ఉధృతంగా ప్రవహించి స్థానిక స్మశాన వాటికను పూర్తిగా ముంచెత్తింది. దీంతో చివరి మజిలీలోనూ మృతులకు గౌరవప్రదంగా వీడ్కోలు పలకలేని దుస్థితి నెలకొంది. రెండు కుటుంబాలకు చెందిన మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు వెళ్లిన బంధువులకు వరద రూపంలో తీవ్ర అవరోధం ఎదురైంది.చనిపోయిన తమ ఆత్మీయులకు సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు బంధువులు స్మశాన వాటికకు చేరుకోగా, అక్కడికి వెళ్లే మార్గమంతా వరద నీటితో నిండిపోయింది .

దొంతికుంట నుంచి వచ్చిన వరద ప్రవాహం స్మశాన వాటిక పరిసరాలను ముంచెత్తడంతో లోపలికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రెండు మృతదేహాలతో వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

ముఖ్యంగా అనాథ ఆశ్రమంలో మృతి చెందిన ఓ వృద్ధుడి మృతదేహంతో పాటు మరో మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తీసుకొచ్చిన వారు గంటల తరబడి వర్షంలోనే నిరీక్షించాల్సి వచ్చింది. ఒకవైపు కళ్లముందు మృతదేహాలు..

మరోవైపు కురుస్తున్న భారీ వర్షం, స్మశాన వాటికను చుట్టుముట్టిన వరద నీరు.. ఈ పరిస్థితి అక్కడున్న వారిని తీవ్ర మనోవేదనకు గురిచేసింది. వరద ఉధృతి తగ్గి దారి అందుబాటులోకి వస్తుందేమోనని ఎంతసేపు ఎదురుచూసినా వర్షం తగ్గకపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

చివరకు గ్రామ పెద్దలు, స్థానికులు ముందుకు వచ్చి సహకరించడంతో మృతదేహాలను ఎంతో కష్టపడి స్మశాన వాటికలోకి తీసుకెళ్లారు. మోకాళ్ల లోతు వరద నీటిలో నడుచుకుంటూ వెళ్లి, కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అంత్యక్రియలు నిర్వహించారు. చివరి వీడ్కోలు పలికే సమయంలో ఎదురైన ఈ దయనీయ పరిస్థితి అక్కడున్న వారందరినీ కలచివేసింది.

స్మశాన వాటికకు శాశ్వత పరిష్కారం కావాలి

సాధారణ రోజుల్లోనే అంత్యక్రియలకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన స్మశాన వాటిక వర్షాకాలంలో వరద నీటికి నిలయంగా మారడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దొంతికుంట వరద నీరు స్మశాన వాటికలోకి చేరకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, స్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని ఎత్తు చేయడంతో పాటు వరద నీరు సులభంగా బయటకు వెళ్లేలా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కనీసం మనిషి మరణించిన తర్వాత నిర్వహించే అంతిమ సంస్కారాలకైనా ఆటంకం కలగకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి ..

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలి - - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్బి
మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



చర్ల, జగిత్యాల: పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి కేసులో దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ సమర్థవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని తెలిపారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరు తప్పనిసరని స్పష్టం చేశారు.

స్టేషన్ పరిధిలో బీట్ వ్యవస్థ, రాత్రి గస్తీ, నేరాల నియంత్రణ చర్యలను సమీక్షిస్తూ రౌడీషీటర్లు, పాత నేరస్తులు, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని, గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత పదార్థాల నియంత్రణకు ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాలపై గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, మైనర్ల వాహన వినియోగం, ప్రమాదకర డ్రైవింగ్, మోడిఫైడ్ సైలెన్సర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ తనిఖీలో మెట్పల్లి సీఐ సురేష్ బాబు, ఎస్ఐ అనిల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ప్రాణ భద్రతే ముఖ్యం.. వర్షాల వేళ జాగ్రత్తలు పాటించాలి

బీఆర్ఎస్ నాయకురాలు, 14వ వార్డు కౌన్సిలర్ భూక్యా ఉదయజ్యోతి.



చర్చ :-అశ్వారావుపేట. అశ్వారావుపేట పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకురాలు, 14వ వార్డు కౌన్సిలర్ భూక్యా ఉదయజ్యోతి కోరారు. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వరద నీరు చేరుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు ఇళ్లలోకి చేరే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, వంకలు, చెరువుల సమీపంలోకి వెళ్లకూడదని సూచించారు.వరద నీరు రహదారులపై ప్రవహిస్తున్న సమయంలో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు రాకపోకలు సాగించేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని కోరారు.అదేవిధంగా రైతులు వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే సమయంలో వర్షాలు, వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపడిన విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని తాకే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు.వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని భూక్యా ఉదయజ్యోతి సూచించారు. వర్షాల సమయంలో అధికారుల సూచనలు పాటిస్తూ అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ప్రజల ప్రాణాల కంటే ఏదీ ముఖ్యమైనది కాదని, ప్రాణ భద్రతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. భారీ వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని భూక్యా ఉదయజ్యోతి విజ్ఞప్తి చేశారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి


పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా అడుగులు..
అర్హుల గుర్తింపులో జాప్యం వద్దు..
త్వరితగతిన మంజూరు ప్రాసీడింగ్స్ అందించాలి:
ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



చర్చ,జగిత్యాల: రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు.జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఎంపీడీవోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ పురోగతిపై అధికారులతో చర్చించారు. అర్హులైన లబ్ధిదారులను త్వరితగతిన గుర్తించి, ఎలాంటి జాప్యం లేకుండా వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు.గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సంక్షేమ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవోలు చిరంజీవి, రమాదేవి, నీరజ, భీమేష్, ఎంపీవో వాసవి తదితరులున్నారు.

హిమాలయ శిఖరంపై మూడు పతాకాల రెపరెపలు!

4 వేల మీటర్ల ఎత్తులో జాతీయ జెండాతో పాటు జై భీమ్, పంచశీల పతాకాల ఆవిష్కరణ
అన్నపూర్ణ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ఓబులాపూర్ న్యాయవాది ఎర్ర రమేష్



చర్చ, జగిత్యాల : మంచుతో కప్పుకున్న హిమాలయ పర్వతాలు.. ఎముకలు కొరికే చలి.. ఊపిరి తీసుకోవడమే సవాలుగా మారే ఎత్తైన ప్రాంతం.. అయినా ఆయన లక్ష్యం ముందు అవేవీ అడ్డంకులు కాలేదు. సాహసమే ఊపిరిగా, పట్టుదలే ఆయుధంగా ముందుకు సాగిన ఓబులాపూర్ గ్రామానికి చెందిన న్యాయవాది ఎర్ర రమేష్ అరుదైన ఘనత సాధించారు. నేపాల్‌లోని 4,130 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రసిద్ధ అన్నపూర్ణ బేస్ క్యాంప్‌ను విజయవంతంగా చేరుకుని భారత జాతీయ జెండాతో పాటు జై భీమ్, పంచశీల పతాకాలను ఆవిష్కరించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. సాధారణ పర్యాటక ప్రయాణానికి భిన్నంగా సాగిన ఈ సాహసయాత్రలో రమేష్ ఎన్నో ప్రకృతి సవాళ్లను ఎదుర్కొన్నారు. జీను నుంచి ప్రారంభమైన ప్రయాణంలో నస్పెన్షన్ బ్రిడ్జిలు, లోతైన లోయలు, ఉధృతంగా ప్రవహించే నదులు, నిటారుగా ఉన్న కొండ మార్గాలు, అంతులేని మెట్ల బాటలను దాటుకుంటూ లక్ష్యం వైపు అడుగులు వేశారు.
చోమ్రూంగ్, లోయర్ సినువా, అప్పర్ సినువా, బాంబూ, దోవాన్, హిమాలయ, దేయురాలి, మచ్చపుచ్చే బేస్ క్యాంప్ మీదుగా అన్నపూర్ణ బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. సుమారు రెండు రోజులు మూడు గంటల వ్యవధిలోనే ఈ క్లిష్టమైన ట్రెక్కింగ్‌ను పూర్తి చేయడం విశేషం.
మైనస్ 5 డిగ్రీల వరకు పడిపోయిన ఉష్ణోగ్రతలు, పలుచబడిన ఆక్సిజన్, తీవ్రమైన చలి, కండరాల నొప్పులు, శారీరక అలసట ఆయనకు పరీక్ష పెట్టాయి. అయినప్పటికీ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగి అనుకున్న గమ్యాన్ని చేరుకున్నారు.
మూడు పతాకాలతో ప్రత్యేక సందేశం..
అన్నపూర్ణ బేస్ క్యాంప్‌కు చేరుకున్న అనంతరం భారతదేశ గౌరవానికి ప్రతీకగా జాతీయ జెండాను, సామాజిక సమానత్వం, స్వేచ్ఛ, సమాన హక్కుల స్ఫూర్తిని చాటుతూ జై భీమ్ జెండాను, శాంతి, కరుణ, ప్రజ్ఞ, మానవతా విలువలకు ప్రతీకగా పంచశీల పతాకాన్ని ఆవిష్కరించారు.హిమాలయాల సాక్షిగా మూడు పతాకాలను ఎగురవేయడం తన జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని ఎర్ర రమేష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, గౌతమ బుద్ధుని మానవతా సందేశం, భారతదేశ గౌరవాన్ని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పాలనే సంకల్పంతో ఈ ఆవిష్కరణ చేపట్టినట్లు తెలిపారు.ఒకవైపు న్యాయవాదిగా వృత్తి బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు సాహసయాత్రలో అరుదైన లక్ష్యాన్ని చేరుకున్న ఎర్ర రమేష్ విజయంపై ఓబులాపూర్ గ్రామస్థులు, పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.


మూడు కోట్లతో నిర్మించిన పెదవాగు రింగుబండ్ గల్లంతు!

తొలి భారీ వరదకే కొట్టుకుపోయిన తాత్కాలిక నిర్మాణం.
నీటిపాలైన ప్రజాధనం.
అశ్వారావుపేటలో వరద బీభత్సం - స్తంభించిన జనజీవనం.
నీటమునిగిన గ్రామాలు, దెబ్బతిన్న పంటలు.









చర్చ :- అశ్వారావుపేట.ప్రకృతి ప్రకోపం ముందు కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన పనులు సైతం నిలవలేకపోయాయి. గతంలో పెదవాగు ప్రాజెక్టుకు ఏర్పడిన భారీ గండిని పూడ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన తాత్కాలిక రింగుబండ్ తాజాగా కురుస్తున్న మురుసు తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో పెదవాగు ప్రాజెక్టు పరిస్థితి మళ్లీ మొదటికి చేరింది. కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించినప్పటికీ, తొలి భారీ వరదకే రింగుబండ్ కొట్టుకుపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.
గతంలో పెదవాగు ప్రాజెక్టుకు భారీ గండి ఏర్పడటంతో సాగునీటి సరఫరా నిలిచిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, సంబంధిత మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకొని సుమారు మూడు కోట్ల రూపాయల నిధులతో తాత్కాలిక రింగుబండ్ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రాజెక్టుకు తాత్కాలికంగా రక్షణ కల్పించడంతో పాటు సాగునీటి సరఫరాకు మార్గం సుగమం అవుతుందని రైతులు ఆశించారు. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలు, తుఫాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. వరద ఉధృతికి రింగుబండ్ సైతం తట్టుకోలేక కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు మళ్లీ ప్రమాదకర స్థితికి చేరుకుంది.
తొలి భారీ వరదకే తేలిపోయిన నిర్మాణం నాణ్యత!
ప్రజాధనంతో చేపట్టిన రింగుబండ్ నిర్మాణం తొలి భారీ వరదకే కొట్టుకుపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది.
పనుల నాణ్యత, నిర్మాణ సమయంలో తీసుకున్న జాగ్రత్తలు, వరద ఉధృతిని అంచనా వేసిన విధానం, అధికారుల పర్యవేక్షణ వంటి అంశాలపై స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వరదలను తట్టుకునేలా పటిష్టమైన నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, తాత్కాలిక మరమ్మతులు కొద్దికాలానికే దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది. మూడు కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసినా ప్రాజెక్టుకు శాశ్వత భరోసా కల్పించలేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
ప్రాజెక్టుకు పదేపదే గండ్లు ఏర్పడటం, తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం, మళ్లీ వరదలకు అవి కొట్టుకుపోవడం పరిపాటిగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారీ ప్రజాధనం వెచ్చించి తాత్కాలిక పనులు చేపట్టడం కంటే, భవిష్యత్తులో ఎలాంటి వరదలొచ్చినా తట్టుకునేలా శాశ్వత ప్రాతిపదికన పటిష్టమైన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. లేదంటే ప్రతి వర్షాకాలంలోనూ ఇదే పరిస్థితి పునరావృతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

స్తంభించిన జనజీవనం.. జలదిగ్బంధంలో గ్రామాలు
మరోవైపు అశ్వారావుపేట మండలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాలకు వెళ్లే రహదారులు జలమయమయ్యాయి. ములకలపల్లి వద్ద గతంలో తెగిపోయిన వంతెన వద్ద నిర్మించిన తాత్కాలిక రహదారి వరదల కారణంగా తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అక్కడక్కడ వంతెనలపై నుంచి వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఎక్కడికక్కడే నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.
లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు, పూరిగుడిసెల్లోకి వరద నీరు చేరడంతో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాలు, తండాల్లో నివసించే ప్రజలు నిత్యావసర వస్తువులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు నీటమునగడంతో అత్యవసర పనులపై బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు, వరదల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ కార్యకలాపాలు సైతం నిలిచిపోయాయి.
నీటమునిగిన పంటలు..కన్నీరుమున్నీరవుతున్న రైతులు
భారీ వర్షాలు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లాయి. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టి సాగు చేసిన మినుము, వరి, పత్తి, వేరుశనగ తదితర పంటలు వరద నీటిలో మునిగి దెబ్బతింటున్నాయి. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పంటలు పాడైపోతాయేమో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొస్తుందనుకున్న పంట కళ్లముందే నీటిపాలవుతుండటంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటికే సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులకు తాజా వరదలు కోలుకోలేని దెబ్బతీశాయి. పంట నష్టంతో అప్పులు ఎలా తీర్చాలి? పెట్టుబడులు ఎలా రాబట్టుకోవాలి? అన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. వ్యవసాయ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.
శాశ్వత పరిష్కారం ఎప్పుడు?
ప్రభుత్వానికి ప్రజల ప్రశ్న
పెదవాగు ప్రాజెక్టు రింగుబండ్ కొట్టుకుపోవడం, గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోవడం, పంటలు నీటమునగడం వంటి పరిణామాలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించినా ప్రాజెక్టుకు రక్షణ లేకపోతే ఆ నిధుల ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తాత్కాలిక రింగుబండే వరద ఉధృతిని తట్టుకోలేకపోతే ప్రాజెక్టుకు శాశ్వత భద్రత ఎప్పుడు కల్పిస్తారని నిలదీస్తున్నారు.
ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పెదవాగు ప్రాజెక్టును పరిశీలించాలని, రింగుబండ్ కొట్టుకుపోవడానికి గల కారణాలను సమగ్రంగా అధ్యయనం చేసి ఆంధ్రా, తెలంగాణా రెండు ప్రభుత్వాల ప్రతినిధులు చర్చించి ప్రాజెక్టును త్వరితగతిన పునర్నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. నాణ్యతా ప్రమాణాలతో శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రాజెక్టుకు పటిష్టమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.
అదే విధంగా వరదల కారణంగా ఇళ్లు, పంటలు నష్టపోయిన బాధిత కుటుంబాలను గుర్తించి తక్షణ సహాయక చర్యలు చేపట్టడంతో పాటు రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. ప్రతి వర్షాకాలంలోనూ పెదవాగు ప్రాజెక్టు చుట్టూ ఇదే ఆందోళన కొనసాగుతుందా? లేక ఈసారైనా శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ 3 గణేష్

నిలిచిన నీటిని తక్షణం మళ్లించాలి
డ్రైన్లలో పూడికతీత పనులు వేగవంతం చేయాలి
ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి
సహాయక చర్యల్లో యంత్రాంగం నిమగ్నం కావాలి
అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం చేపట్టాలి అని కొత్తగూడెం నగర మేయర్ మూడ్ గణేష్ అధికారులకు చెప్పారు



నేటి చర్చ : కొత్తగూడెం, 4 నవంబర్, లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం నగర మేయర్ మూడ్ గణేష్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం పాల్వంచలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. పాల్వంచ పరిధిలోని 8, 42 డివిజన్లలో నిలిచిన వరద నీటిని డ్రైన్ల వైపు మళ్లించే పనులను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రధాన, అంతర్గత రహదారులపై నిలిచే మోకాళ్ళలోతు నీటిని సమీప మురుగు కాలువల ద్వారా సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. వరద నీరు వెనక్కి తన్నకుండా, ఆవాసాల్లోకి చేరకుండా అదనపు మోటార్లతో నీటిని తోడివేయాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. డ్రైన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను జేసీబీలతో తక్షణమే తొలగించి పూడికతీత పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. వాతావరణం సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు క్షేత్రస్థాయిని విడిచి వెళ్లరాదని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల వేళ విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, దోమల మందు పిచికారీ పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూమ్‌ను సమన్వయం చేసుకుంటూ, తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వర్షాల వల్ల ఇబ్బందులు పడే నగరవాసులకు ప్రతి డివిజన్‌లోనూ సత్వర సహాయం అందించాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, డిప్యూటీ మేయర్ లలిత, కార్పొరేటర్ జివిఆర్, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఖమ్మం...

సైబర్ జాగృత దివస్ లో భాగంగా ఈరోజు బుధవారం సైబర్ క్రైమ్ డి.ఎస్.పి. సిహెచ్.ఆర్.వి. ఫణీందర్ సూచనల మేరకు,సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ డీ.రవి కుమార్ సైబర్ నేరాలపై , అవగాహన కార్యక్రమాన్ని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ , టేకులపల్లి, ఖమ్మం లో కాలేజ్ విద్యార్థులకు అవగాహన కల్పించినారు .దీనిలో భాగంగా 1)అడ్వర్టయిజ్ మెంట్ ఫ్రాడ్ 2) ఐడెంటిటీ తెఫ్ట్ ఫ్రాడ్, 3) బిజినెస్ మరియు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్ లోన్ యాప్ అర్రాస్మెంట్ / బ్లాక్ మెయిల్ , గురుంచి తెలిపారు. ఎవరు అయిన సైబర్ క్రైమ్ కి గురి అయితే వెంటనే 1930 కి కాల్ చేసి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో కేసు నమోదు చేయాలి అని తెలిపారు. WhatsApp, టేలిగ్రామ్ యాప్ లలో అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదు అని, ఓటపి లు, బ్యాంక్ వివరాలు షేర్ చేయకూడదు అని తెలిపారు.



ఈ కార్యక్రమములో సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఎస్. ఐ. వీ. విజయ్ కుమార్ మరియు హెడ్ కానిస్టేబుల్ యం.ప్రసాద్, మహిళా పోలీస్ నాగేంద్రమ్మ,అఫ్సనా మరియు సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్, ఇంచార్జ్ ప్రిన్సిపల్ శ్రీమతి A. రీనాధరి దేవి ,కాలేజీ ఫ్యాకల్టీ మరియు విద్యార్థులు హాజరు అయ్యారు.

పోలీసులు -- పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేస్తే నేరస్తులకు శిక్షలు పడే శాతం పెరుగుతుంది

కేసుల దర్యాప్తు నుంచి న్యాయస్థానంలో శిక్షలు పడే వరకు సమన్వయం, సమిష్టి కృషి ఎంతో కీలకం
జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్





జిల్లాలో నేర నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడిన వారికి చట్టప్రకారం శిక్షలు పడేలా పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ గారు సూచించారు.

ఈ సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ గారు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసుల దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్ల దాఖలు, న్యాయస్థానాల్లో కేసుల విచారణ తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, నేరస్తులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడే శాతాన్ని (జశీఅజఱఖీఅశీఅ ఝ్ఞవ) పెంచడంలో పోలీస్ శాఖతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. కేసుల దర్యాప్తు దశ నుంచే పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సలహాలు, సూచనలు తీసుకోవడం ద్వారా సాంకేతికంగా, చట్టపరంగా ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా కేసులను సిద్ధం చేయవచ్చని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సమాచార మార్పిడి చేసుకుంటూ, కేసుల వారీగా సమీక్షించుకుంటూ సమిష్టిగా పనిచేస్తే నేరస్తులకు శిక్షలు పడే అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు.ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై నేరాలు, పోక్సో కేసులు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బాధితులకు న్యాయం జరిగేలా పకడ్బందీగా ఆధారాలు సమర్పించాలని సూచించారు. కోర్టు విచారణ సమయంలో సాక్షుల హాజరు, సాక్ష్యాధారాల సమర్పణ, కేసుల పురోగతిపై నిరంతరం సమన్వయం కొనసాగించాలని అధికారులకు సూచించారు.అనంతరం సమావేశంలో పాల్గొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సేవలను అభినందిస్తూ జిల్లా ఎస్పీ గారు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖకు, ప్రాసిక్యూషన్ విభాగానికి మధ్య ఉన్న సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చీదీ రత్నం, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్, DSP వెంకటేశ్వర్లు, DCRB DSP రమణా రెడ్డి, వర్టికల్ DSP బాలాజీ, ఇతర PP లు, APP లు ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

విదేశీ పౌరులకు వసతి కల్పించే ప్రతి ఒక్కరూ ఫార్మ్-III ఆన్‌లైన్ నమోదు తప్పనిసరిగా చేయాలి ..

ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు -- జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్



నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ భారతదేశానికి వచ్చే విదేశీ పౌరులకు వసతి కల్పించే హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, పీజీ వసతులు, హాస్టళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, హోమ్‌స్టేలు, ప్రైవేట్ ఇళ్ల యజమానులు తదితరులు ఇమ్మిగ్రేషన్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సూచించారు. భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, హైదరాబాద్ ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఖీ==ూా) జారీ చేసిన పబ్లిక్ అడ్వైజరీ ప్రకారం విదేశీ పౌరుల రాకపోకలకు సంబంధించిన వివరాలను నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వసతి కల్పించే వారి చట్టబద్ధమైన బాధ్యత అని తెలిపారు.

ఫార్మ్-III నమోదు తప్పనిసరి

ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025లోని సెక్షన్ 8 ప్రకారం విదేశీ పౌరులకు వసతి కల్పించే వ్యక్తులు, సంస్థలు వారి రాక, నిష్క్రమణ వివరాలను ఫార్మ్-III (గతంలో ఫార్మ్-జ) ద్వారా ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు తెలియజేయాలి. ఈ నిబంధనలు OCI కార్డు కలిగిన విదేశీ పౌరులు, నేపాల్, భూటాన్ పౌరులతో సహా వర్తించే విదేశీ పౌరుల విషయంలో పాటించాల్సి ఉంటుందని సూచించారు. విదేశీ అతిథి వచ్చిన 24 గంటల్లోగా సంబంధిత వివరాలను నమోదు చేయాలని, నమోదు చేసిన రికార్డులను ఒక సంవత్సరం పాటు భద్రపరచాలని తెలిపారు.

హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, Airbnb వసతులు, పీజీలు, హాస్టళ్లు మాత్రమే కాకుండా విదేశీ అతిథులకు వసతి కల్పించే ప్రైవేట్ ఇళ్ల యజమానులు, హోమ్‌స్టే నిర్వాహకులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ఇతర వసతి ప్రదాతలు కూడా తమకు వర్తించే నిబంధనలను తెలుసుకుని అమలు చేయాలని ఎస్పీ సూచించారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

విదేశీ పౌరులకు వసతి కల్పించే వారు అధికారిక వెబ్‌సైట్ https://indianfrro.gov.in ద్వారా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి. ముందుగా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, అవసరమైన వివరాలు సమర్పించి, సంబంధిత కార్యాలయం నుంచి లాగిన్ వివరాలు పొందిన అనంతరం విదేశీ అతిథుల వివరాలను నిర్ణీత గడువులోగా నమోదు చేయాలి. వసతి ప్రదాతలు తమకు వర్తించే మాడ్యూల్, అవసరమైన పత్రాలు, సమర్పణ విధానం గురించి అధికారిక పోర్టల్‌లోని సూచనలను అనుసరించాలని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విదేశీ పౌరుల వివరాలను నిర్ణీత సమయంలో నమోదు చేయకపోవడం, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ లేదా వీసా లేకుండా విదేశీయులకు వసతి కల్పించడం, నకిలీ ప్రయాణ పత్రాలను ఉపయోగించడం, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అక్రమంగా దేశంలో ఉండటం వంటి ఉల్లంఘనలకు సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం జరిమానాలు, క్రిమినల్ ప్రాసిక్యూషన్ లేదా ఇతర చట్టపరమైన చర్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ఎస్పీ హెచ్చరించారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు కూడా తమకు వర్తించే ప్రత్యేక రిపోర్టింగ్ నిబంధనలను పాటించాలని సూచించారు.

విదేశీ పౌరులు కూడా నిబంధనలు పాటించాలి

భారతదేశంలో నివసిస్తున్న విదేశీ పౌరులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, వీసా కలిగి ఉండాలని, వీసా నిబంధనలకు అనుగుణంగా తమ నివాసాన్ని కొనసాగించాలని సూచించారు. నివాస చిరునామా మారినప్పుడు వర్తించే విధంగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, పాస్‌పోర్ట్ లేదా వీసా పోగొట్టుకున్న సందర్భంలో వెంటనే స్థానిక పోలీసులకు, FRRO అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థులు తమ వీసా నిబంధనలను పాటించడంతో పాటు విద్యాసంస్థ లేదా కోర్సు మార్పులకు సంబంధించిన వివరాలను అవసరమైన విధంగా అప్‌డేట్ చేయాలి. తప్పుడు పత్రాలను సమర్పించడం, వీసా గడువు దాటిన తర్వాత దేశంలో కొనసాగడం, అనుమతి లేని కార్యకలాపాలకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.విదేశీ పౌరులకు వసతి కల్పించే యజమానులు, నిర్వాహకులు ఈ నిబంధనలపై అవగాహన పెంచుకుని సకాలంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ కోరారు. చట్ట నిబంధనలను పాటించడం ద్వారా అనవసరమైన చట్టపరమైన ఇబ్బందులను నివారించుకోవచ్చని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తతే అసలైన రక్షణ... జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్..,

సైబర్ మోసాలకు గురైతే వెంటనే స్పందించండి... ఆలస్యం చేయవద్దు... అప్రమత్తంగా ఉండండి...
ప్రతి నెల మొదటి బుధవారం "సైబర్ జాగ్రత్త దివాస్"



జోగులాంబ గద్వాల పోలీస్సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ గారు సూచించారు.

సైబర్ నేరాల నివారణలో భాగంగా ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహిస్తున్న "సైబర్ జాగ్రత్త దివాస్" కార్యక్రమంలో భాగంగా బుదవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను జిల్లా ఎస్పీ గారు అదనపు ఎస్పీ శ్రీ కె. శంకర్ గారి తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ షాపింగ్, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వంటి సేవలను వినియోగించే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. తెలియని లింకులు, ఆకర్షణీయమైన ఆఫర్లు, నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ యాప్‌లు, మోసపూరిత కాల్స్ ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని హెచ్చరించారు.

సైబర్ మోసాల నుంచి రక్షణకు ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు:

వినికిడి, చూపు, స్పర్శ, వాసన, అభిరుచి వంటి పంచేంద్రియాల సమాచారాన్ని అనవసర యాప్‌లు లేదా వెబ్‌సైట్లకు ఇవ్వకూడదు. తెలియని వ్యక్తులతో వీడియో కాల్స్, ఆన్‌లైన్ చాటింగ్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. అనుమానాస్పద లింకులు, ఫేక్ మెసేజ్‌లు, తెలియని యాప్‌లను ఓపెన్ చేయకూడదు. తెలియని వ్యక్తులు పంపిన లింకుల ద్వారా యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దు. సైబర్ నేరగాళ్లు అడిగినప్పటికీ ూూా, ూ×చీ, పాస్‌వర్డ్ వంటి వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దు. పబ్లిక్ ఔఅ-ళీఅ, అనుమానాస్పద నెట్‌వర్క్‌లలో బ్యాంకింగ్ లేదా ఇతర ఆర్థిక లావాదేవీలు చేయవద్దు. మొబైల్ ఫోన్, యాప్‌లు, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. అవసరం లేని యాప్‌లకు కెమెరా, మైక్రోఫోన్, కాంటాక్ట్స్ వంటి అనుమతులు ఇవ్వకూడదు.

ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు:

భారీ డిస్కౌంట్లు, తక్కువ ధరల పేరుతో వచ్చే సందేశాలను నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచించారు. నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ప్రజలను మోసం చేసే అవకాశం ఉన్నందున, వెబ్‌సైట్ యొక్క సరైన అడ్రస్‌ను పరిశీలించిన తర్వాతే కొనుగోళ్లు చేయాలని తెలిపారు. తెలియని లింకులపై క్లిక్ చేయకుండా, వీలైనంత వరకు నమ్మకమైన వెబ్‌సైట్లు, అధికారిక యాప్‌ల ద్వారా మాత్రమే షాపింగ్ చేయాలని సూచించారు. డిజిటల్ చెల్లింపుల్లో అప్రమత్తత అవసరం ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు అధికారి, యూపీఐ ప్రతినిధి లేదా ఇతర సంస్థల ప్రతినిధినని చెప్పినా వెంటనే నమ్మవద్దని తెలిపారు. ూమీ, ఇమెయిల్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చిన అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. ఖూ× ద్వారా డబ్బు పొందడానికి ూ= కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని, డబ్బు పంపే సమయంలో మాత్రమే జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఫోన్ కాల్‌లో ఎవరైనా బ్యాంకు వివరాలు, ఖూూ,ూ×చీ లేదా పాస్‌వర్డ్ అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని హెచ్చరించారు.

"అప్రమత్తతే సైబర్ భద్రతకు మొదటి అడుగు"

సైబర్ నేరాల బారిన పడిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని జిల్లా పోలీసులు తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా, సైబర్ నేరాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లా పోలీసులు ముందుకు సాగుతున్నారని ఎస్పీ గారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

....పి.ఆర్.ఓ.
జిల్లా పోలీస్ కార్యాలయం,
జోగులాంబ గద్వాల్ జిల్లా.

బియ్యం కోట్లలో ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించిన అదనపు కలెక్టర్.



నేటి చర్చ : కొత్తగూడెం,4 నవంబర్ . కొత్తగూడెంలో నీ బియ్యం కోట్లలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తనిఖీలు చేపట్టారు. ధరల పట్టికలు ప్రదర్శించకుంటే సెక్షన్ 6A ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ 1955 ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.కొత్తగూడెం కమీషనర్ సివిల్ సప్లైస్, హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని కొత్తగూడెం పట్టణంలో వివిధ బియ్యం విక్రయించే దుకాణాల ను అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ మరియు ణ.వీ (సివిల్ సప్లయ్), ణ.ం ణ. శంకర్ రావు (కొత్తగూడెం), జి. ప్రభాకర్ (మణుగూరు), జి. రాజులు (అశ్వారావుపేట)మరియు ఎం. రాజేశ్వరరావు (భద్రాచలం) వారు తనిఖీలు నిర్వహించి ప్రతి దుకాణం యందు ధరల పట్టికను పెట్టి అట్టి పట్టికలో నిర్ణయించిన ధరల ప్రకారం వినియోగదారులకూ విక్రయించే విధముగా ఆదేశాలు జారీ చేయటం జరిగింది.దీనిని అతిక్రమించిన యెడల నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం సెక్షన్ ఱూ ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ 1955 ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించటం జరిగినది. ఆదే విధముగా వినియోగదారులు కూడా ఎవరైనా బియ్యం దుకాణాదారులు అధిక ధరలకు విక్రయించి నట్లు తెలిస్తే సివిల్ సప్లైస్ అధికారుల కు పిర్యాదు చేయవలసిందిగా కోరడమైనది మరియు జిల్లలోనీ మిగత రైస్ దుకాణదారులు అందరు కూడా ధరల పట్టిక ను ఏర్పాటు చేసి, ఆయా ధరల ప్రకారం విక్రయించవలసినదిగా ఆదేశించినారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన మహిళా కండక్టర్ ప్రవళిక





నేటి చర్చ : మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వద్ద కొడుకుతో కలిసి భద్రాచలం వెళ్లే బస్సు ఎక్కిన అశ్వాపురం మండలం మిట్టగూడెంకు చెందిన మౌనిక అనే మహిళ.కొడుకుకు టికెట్ ఇవ్వమని రూ. 100 ఇవ్వగా, రూ. 10 టికెట్ జారీ చేసి, మిగతా చిల్లరను టికెట్ వెనుక రాసిన కండక్టర్ ప్రవళిక.తనకు చిల్లర ఇప్పుడే కావాలని కండక్టర్‌తో వాగ్వాదానికి దిగి, ఆమెను బస్సు నుంచి కిందకు నెట్టివేసిన మౌనిక దీంతో బస్సు వెనుక టైర్ల కింద పడి ప్రవళిక రెండు కాళ్లు విరిగిన వైనం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన మహిళా కండక్టర్ ప్రవళిక.

కొడిపల్లి ఎస్ఐగా నూతన బాధ్యతలు స్వీకరించిన నీరేష్.. జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన వైనం



జిల్లా పోలీస్ కార్యాలయం మెదక్ జిల్లా కొడిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నూతన బాధ్యతలు స్వీకరించిన నీరేష్ బుధవారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి మొక్కను అందజేశారు. కొడిపల్లి పోలీస్ స్టేషన్‌లో గతంలో ఎస్ఐగా విధులు నిర్వహించిన అమర్ జిల్లా పోలీస్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించేలా అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్ఐ నీరేష్‌కు సూచించారు.ం

ముఖ్యమంత్రి గారి పర్యటన, బహిరంగ సభ, వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, రైతు మేళా నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు చేపట్టాలి: జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్

బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణపై పోలీసు అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దిశానిర్దేశం





కొడంగల్ నియోజకవర్గంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి పర్యటన, బహిరంగ సభ, రైతు మేళా, వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నేపథ్యంలో పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా బుధవారం కొడంగల్‌లోని KADA కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ మ్యాపింగ్, విధుల కేటాయింపు, పోలీసు సిబ్బంది మోహరింపు తదితర అంశాలపై ఎస్పీ గారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు.పిపిటి ద్వారా సంబంధిత ప్రాంతాల మ్యాపింగ్‌ను ప్రదర్శిస్తూ, ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, బహిరంగ సభా ప్రాంగణం, రైతు మేళా నిర్వహించే ప్రదేశం, వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ పాయింట్లు, బందోబస్తు విధులు నిర్వహించాల్సిన కీలక ప్రాంతాలను వివరించారు. ప్రతి పోలీసు అధికారి తమకు కేటాయించిన ప్రాంతం, విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధుల నిర్వహణలో ఎలాంటి గందరగోళానికి, నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ సభా ప్రాంగణం, రైతు మేళా పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల పోలీసు బలగాలను మోహరించాలని తెలిపారు.అనంతరం జిల్లా ఎస్పీ గారు క్షేత్రస్థాయిలో పర్యటించి బహిరంగ సభ నిర్వహించే ప్రాంగణం, రైతు మేళా ప్రదేశం, ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లు, పార్కింగ్ స్థలాలు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, పోలీసు సిబ్బంది విధుల కేటాయింపుపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.బందోబస్తు విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, అప్రమత్తత, సమయపాలన పాటిస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గారు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీసీఆర్బీ డీఎస్పీ జనయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాస్, తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, జిల్లా పోలీసు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ పోలీస్... మీ పోలీస్...

జనసమూహాల్లో అనుమానితుల గుర్తింపునకు కొత్త సాంకేతిక విధానం

FRS కొత్త మాడ్యూల్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS





నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునేందుకు నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (FRS) కొత్త మాడ్యూల్‌పై పోలీస్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జనసమూహాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ముఖాల ఆధారంగా గుర్తించే విధానంపై వివరించారు. ఈ సాంకేతికత ద్వారా అనుమానిత వ్యక్తులను త్వరగా గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే NAFIS (National Automated Fingerprint Identification System) ద్వారా వేలిముద్రల ఆధారంగా వ్యక్తులను గుర్తించే విధానం గురించి వివరించారు. నేర పరిశోధనలో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఫింగర్ ప్రింట్ యూనిట్ నిర్మల్ సిబ్బంది, డీసీఆర్బీ సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు మరింత సమర్థవంతంగా కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

క్రాకర్స్ యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు





నారాయణపేట జిల్లా పోలీస్‌తేదీ: 04-11-2026నారాయణపేట: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా (క్రాకర్స్) విక్రయించే దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు.

ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాణసంచా దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, బాణసంచా దుకాణాలను జనసంచారం తక్కువగా ఉండే సురక్షితమైన బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు తెలిపారు. దుకాణాల నిర్వహణకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారుల నుంచి ముందస్తు అనుమతులు, అవసరమైన ఎన్ఓసీలు తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు.

దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక పరికరాలు, ఇసుక, నీటి సదుపాయాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు పాటించాలని, దుకాణాల పరిసరాల్లో ధూమపానం, నిప్పు వెలిగించడం పూర్తిగా నిషేధించాలని తెలిపారు.

అలాగే అనుమతించిన ప్రదేశాల్లోనే బాణసంచా నిల్వ చేయాలని, నిర్ణీత పరిమితికి మించి టపాసులను నిల్వ ఉంచరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేసినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రత దృష్ట్యా బాణసంచా విక్రయదారులు పోలీస్ శాఖ సూచనలు, ప్రభుత్వ నిబంధనలకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

ఆలయాల అభివృద్ధి పై మంత్రి పొన్నం సమీక్ష





నేటి చర్చ:- **హుస్నాబాద్:**హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాల అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

కార్తీక మాసంలో ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేలా ఏర్పాట్లు చేయాలి

ఆలయాల నిర్మాణ పనులు ప్రారంభమైన తర్వాత వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాల అభివృద్ధిపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో దేవాదాయ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయం, హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం, పొట్లపల్లిలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన నిర్మాణ పనులు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 3.80 కోట్లు, హుస్నాబాద్ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ. 80 లక్షలు, పొట్లపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 1.50 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు.

ఆలయాల నిర్మాణాలు భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ చేపట్టాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ స్థపతి, ఇతర అధికారులు, పండితులు, నిపుణులతో ఆలయాల నిర్మాణ ప్రణాళికలు, అభివృద్ధి పనులపై చర్చించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని మూడు ప్రధాన ఆలయాల అభివృద్ధి పనులకు కార్తీక మాసంలో శంకుస్థాపన చేసేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

- శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ గర్భగుడిని రాతి కట్టడంగా నిర్మించాలని నిర్ణయించారు.
- పొట్లపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు.
- నిర్మాణ పనులు ప్రారంభమైన అనంతరం ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా కొనసాగించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి సూచించారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాలను అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, దేవాదాయ శాఖ స్థపతి శ్రీ వల్లి నాయగం, దేవాదాయ శాఖ డీఈ ఓం ప్రకాష్, ఈవో కిషన్ రావు , పండితులు వినయ్ శర్మ, సతీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాయి గ్రామం వద్ద పాములేరు వాగు వరద ఉధృతిని పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

వరద ఉధృతి పెరిగితే ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలి -- అధికారులకు ఆదేశాలు





భద్రాద్రి కొత్తగూడెం జిల్లాఎస్పీ కార్యాలయంభద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తాళ్లపాయి గ్రామంలోని పాములేరు వాగు వరద ఉధృతిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో వాగులో పెరుగుతున్న వరద ప్రవాహాన్ని, పరిసర ప్రాంతాల్లో వరద ప్రభావాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పాములేరు వాగులో వరద ఉధృతి కారణంగా తాళ్లపాయి గ్రామం నుంచి బూర్గంపాడు వెళ్లే మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజల భద్రత దృష్ట్యా ఈ మార్గంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. వరద ఉధృతి తగ్గే వరకు ప్రజలు ఈ మార్గంలో ప్రయాణించవద్దని, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. వర్షాలు ఇదే విధంగా కొనసాగి వరద ఉధృతి మరింత పెరిగితే స్థానిక ప్రజలను ముందస్తుగా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా అవసరమైన సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీడీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రజలు వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఆర్డీవోలకు మరిన్ని అధికారాలు కల్పించాలి

భూ భారతి దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండకుండా త్వరితగతిన పరిష్కరించాలి -- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మండల కేంద్రాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టాలి

సిద్ధాపూర్ ఎకో టౌన్‌పై ప్రజల ఆందోళనలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే



మేడ్చల్--మల్కాజిగిరి కలెక్టరేట్‌లో బుధవారం మేడ్చల్--మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు సంబంధించిన రెవెన్యూ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొని నియోజకవర్గంలోని పలు కీలక రెవెన్యూ సమస్యలు, అభివృద్ధి అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. భూ భారతి పోర్టల్‌లోని TM-33, TM-15 మాడ్యూళ్ల ద్వారా భూమి రకం మార్పు, భూ విస్తీర్ణం సవరణ, ప్రొహిబిటెడ్ జాబితా నుంచి భూముల తొలగింపు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు తహశీల్దార్ల నివేదికల ఆధారంగా జిల్లా కలెక్టర్ల ద్వారా పరిష్కారమవుతున్నాయని తెలిపారు. అయితే కలెక్టర్లపై పని ఒత్తిడి, సమయాభావం కారణంగా ఈ దరఖాస్తులు ఐదు నుంచి ఆరు నెలల పాటు పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, వారికి సత్వర న్యాయం జరిగేలా ఈ దరఖాస్తులను స్థానిక స్థాయిలోనే పరిష్కరించే విధంగా రెవెన్యూ డివిజనల్ అధికారులకు (RDO) మరిన్ని అధికారాలు కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. అదేవిధంగా సాదాబైనామా, ORC పట్టాల జారీకి సంబంధించి ప్రభుత్వం త్వరితగతిన స్పష్టమైన మార్గదర్శకాలు, విధివిధానాలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. భూమి అందుబాటులో ఉన్న గ్రామాలు, మండల కేంద్రాల్లో పట్టణాల తరహాలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. దీనివల్ల మండల కేంద్రాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. డంపింగ్ యార్డుల ఏర్పాటు విషయంలో ప్రతి నియోజకవర్గానికి సంబంధించి అదే నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో సేకరించిన చెత్తను గ్రామీణ ప్రాంతాలకు తరలించడం సరైన నిర్ణయం కాదని పేర్కొంటూ, గ్రామీణ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వ్యర్థాల నిర్వహణకు శాస్త్రీయమైన విధానాలను అమలు చేయాలని కోరారు. కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో గతంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో భూసేకరణ చేపట్టి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అయితే ఇటీవల అదే ప్రాంతంలో ఎకో టౌన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేస్తున్న విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో కాలుష్యకారక పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు పరిధి వెలుపలకు తరలించాలంటూ టీజీఐఐసీ మెమో జారీ చేయడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని వివరించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలు, వారి ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సిద్ధాపూర్ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు గాంధీ, మనోహర్ రెడ్డి, కాలె యాదయ్య, మర్రి రాజశేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో వరుస మరణాలు.. నిద్రపోతున్న వైద్య ఆరోగ్య శాఖ?

ఆపరేషన్ విజయవంతమైందన్నారు.. అరగంటలోనే బాలిక మృతి!

ప్రతిమ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై తండ్రి ఫిర్యాదు..

సమగ్ర విచారణకు డిమాండ్

ప్రైవేట్ ఆసుపత్రులపై ప్రభుత్వ పర్యవేక్షణ ఏదీ?

చిన్నారి మృతిపై తండ్రి ప్రశ్న



13 ఏళ్ల బాలిక అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై తండ్రి తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం లేదా చికిత్సలో జరిగిన లోపాలే తన కుమార్తె మరణానికి కారణమై ఉండవచ్చని ఆరోపిస్తూ, బాధ్యులైన వైద్యులు,ఆసుపత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం చిన్న ఉమ్మెత్తల గ్రామానికి చెందిన ఎన్నేపల్లి రాఘవేందర్ రెడ్డి (39) కుమార్తె ఎన్నేపల్లి సహస్ర రెడ్డి (13) ఎల్‌బీనగర్‌లోని నారాయణ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతోంది. దసరా సెలవులకు స్వగ్రామానికి వచ్చిన సమయంలో అనారోగ్యానికి గురికావడంతో తొలుత నానక్‌రామ్‌గూడలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఐరన్, విటమిన్ లోపాలు ఉన్నాయని మందులు ఇచ్చారు. వారం రోజుల పాటు మందులు వాడినా ఆరోగ్యంలో మెరుగుదల కనిపించకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అక్టోబర్ 24న కేపీహెచ్‌బీ కాలనీ అడ్డగుట్టలోని ప్రతిమ ఆసుపత్రిలో చేర్పించారు.

ఊపిరితిత్తుల్లో ద్రవం గుర్తింపు.. తొలగింపు ప్రక్రియ

ప్రతిమ ఆసుపత్రిలో వైద్యులు నిర్వహించిన స్కానింగ్, అల్ట్రాసౌండ్ పరీక్షల్లో కుడివైపు ఊపిరితిత్తుల వద్ద ద్రవం పేరుకుపోయినట్లు గుర్తించారు. దీంతో సిరంజి ద్వారా సుమారు అర లీటరు ద్రవాన్ని తొలగించారు. అయితే అక్టోబర్ 26న మళ్లీ నిర్వహించిన ఛాతీ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షల్లోనూ ద్రవం పూర్తిగా తొలగిపోలేదని వైద్యులు తెలిపినట్లు తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పైపు ద్వారా ద్రవాన్ని తొలగించాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియకు 10 నుంచి 15 నిమిషాలు మాత్రమే పడుతుందని వైద్యులు చెప్పారని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని భరోసా ఇవ్వడంతో తాము అంగీకరించినట్లు తెలిపారు.

ఆపరేషన్ విజయవంతమైందని చెప్పి.. అంతలోనే విషాదం!

అక్టోబర్ 26న రాత్రి సుమారు 7.30 గంటలకు సహస్రను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. సుమారు గంట తర్వాత డాక్టర్ ఎర్రబెల్లి హర్షిణి బయటకు వచ్చి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని,ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపినట్లు తండ్రి పేర్కొన్నారు. మరో అరగంటలో బాలిక కోలుకుని గదికి వస్తుందని చెప్పినప్పటికీ, కొద్దిసేపటికే పల్స్ తగ్గిందని చెబుతూ ఐసీయూకు తరలించారని తెలిపారు.

అనంతరం అదే రోజు రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో తమ కుమార్తె మరణించినట్లు వైద్యులు సమాచారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తె మరణానికి కారణమేంటని డాక్టర్ ఎర్రబెల్లి హర్షిణి, డాక్టర్ బోయినపల్లి ప్రతీక్‌లను ప్రశ్నించగా బాలికకు రక్తం గడ్డకట్టే సమస్య ఉండటంతో పాటు ఊపిరితిత్తుల సమస్య కూడా ఉందని తెలిపినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఆసుపత్రిలో చేర్పించినప్పటి నుంచి నిర్వహించిన పరీక్షల్లో కానీ, స్కానింగ్, ఇతర వైద్య పరీక్షల సమయంలో కానీ రక్తం గడ్డకట్టే సమస్య ఉన్నట్లు తమకు ముందుగా తెలియజేయలేదని ఆరోపించారు. చికిత్సలో ఎదురయ్యే ప్రమాదాలు, సంభవించే సమస్యల గురించి కూడా స్పష్టంగా వివరించలేదని పేర్కొన్నారు.

సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

శస్త్రచికిత్స విజయవంతమైందని చెప్పిన కొద్దిసేపటికే కుమార్తె మరణించడంతో తమకు అనేక అనుమానాలు కలుగుతున్నాయని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం జరిగిందా? చికిత్సలో ఏమైనా లోపాలు ఉన్నాయా? లేక ఇతర వైద్యపరమైన కారణాలతో మరణం సంభవించిందా? అనే అంశాలపై నిపుణుల వైద్య బృందంతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. తన కుమార్తె మరణానికి గల వాస్తవ కారణాలను వెలుగులోకి తీసుకువచ్చి, విచారణలో నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులైన వైద్యులు, ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్ట్ పోలీసు నిఘా క్రిష్ణ

చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలి.. విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతగా పనిచేయాలి గుడుంబా,పేకాట, బెట్టింగ్,గంజాయి విక్రయం,అక్రమ రవాణాపై నిరంతర నిఘా, తనిఖీలు.. చేయాలని అధికారులకు మరియు సిబ్బంది కి జిల్లా ఎస్పీ సూచన కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్,ఐపీఎస్ గారు ఈరోజు చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని, చట్టపరిధిలో సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని,కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉంటూ,అసాంఘిక కార్యకలాపాలు,గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా,విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు







గ్రామస్థాయిలో పోలీసులపై ప్రజలకు నమ్మకం,విశ్వాసం పెంపొందించేలా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని,విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.

పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, క్రమశిక్షణ,సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు.

ఈ తనిఖీలో కౌటాల సిఐ సంతోష్,ఎస్సై కమలాకర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

పంట నష్టాన్ని పరిశీలించిన సిపిఐ బృందం

జిల్లా కార్యదర్శి మంద పవన్

నేటి చర్చ :-హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో సీపీఐ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కరువు యాత్రలో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పోట్లపల్లి, నాగారం, మహ్మదాపూర్ గ్రామాల్లో కరువు పరిస్థితులతో దెబ్బతిన్న పత్తి, వరి పంటలను సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆధ్వర్యంలోని బృందం బుధవారం పరిశీలించింది. రైతులతో మాట్లాడి పంటల పరిస్థితి, సాగు ఖర్చులు, దిగుబడుల వివరాలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ.వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున



పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు తక్షణ సహాయం అందించాలని కోరారు. ఈ మూడు మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాయడాన్ని సీపీఐ స్వాగతిస్తోందని మంద పవన్ తెలిపారు. ఈ చొరవ తీసుకున్న మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి కరువు మండలాల ప్రకటనతో పాటు రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేశ్, జేరిపోతుల జనార్ధన్, అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, నాయకులు శివలింగు కృష్ణ, మాడిశెట్టి శ్రీధర్, కొయ్యడ కొమురయ్య, ఐలేని సంజీవరెడ్డి, పిట్టల బాలయ్య, కాల్వల ఎల్లయ్య, బైరి శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, మౌటం బాలయ్య, బుడా వెంకటమల్లు, ఇజ్జగిరి కిష్టయ్య, వేల్పుల ప్రసన్నకుమార్, రైతు సంఘం నాయకులు రాజయ్య, బాలయ్య, బోడ సంపత్, రాగుల వెంకటరెడ్డి, గుజ్జుల నాగిరెడ్డి, అనవోజు భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి బీఆర్ఎస్ హయాంలోనే ప్రాధాన్యం

గిరిజనులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి
గుగులోతు రాజు నాయక్
అక్కన్నపేట మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు

నేటి చర్చ :- హుస్నాబాద్/ పక్కన పేట :బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా అక్కన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు రాజు నాయక్ మండలంలోని పలు తండాల్లో బుధవారం పర్యటించారు. నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా హాథిరాం అంబానాయక్ తండా, శ్రీరామ్ తండా, సేవాలాల్ మహారాజ్ తండా, చౌటకుంట తండాలను సందర్శించి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు.



ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ గిరిజన ఉప ప్రణాళిక నిధుల ద్వారా అక్కన్నపేట మండలంలోని తండాలకు అనుసంధాన రహదారులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు, గిరిజన బంధు కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం, తండాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించడం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇరుగు రమేష్, భూక్య వీరన్న నాయక్, భూక్య రాజు నాయక్, సేవాలాల్ మహారాజ్ తండా నాయకులు బానోతు భాస్కర్ నాయక్, బానోతు తిరుపతి నాయక్, హాథిరాం అంబానాయక్ తండా నాయకులు లునావత్ జుమ్లా, బీమా, శ్రీరామ్ తండా నాయకులు బానోతు విజయ్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

వేశ్యకాంతల ఆయకట్టుకు జలగండం!

వరద ఉధృతిలోకి దిగి బాధితులకు అండగా ఎమ్మెల్యే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల రెండో అంతస్తు వరకు వరద నడుములోతు నీటిలో పర్యటన.. రాత్రంతా సహాయక చర్యల పర్యవేక్షణ

సత్తుపల్లి, నవంబర్ 04వేశ్యకాంతల చెరువు వరద ఉధృతి సత్తుపల్లి లో కలకలం రేపింది. చెరువు కట్టపై నుంచి పొంగిపొర్లుతున్న నీరు దిగువ ప్రాంతాలను ముంచెత్తడంతో వేశ్యకాంతల ఆయకట్టు ప్రమాదంలో పడింది. సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ నివాస సముదాయాల్లో రెండో అంతస్తు వరకు వరద నీరు చేరడంతో పరిస్థితి భయానకంగా మారింది. పంట పొలాలు నీటమునిగాయి. ఇళ్లను వరద చుట్టుముట్టడంతో కుటుంబాలు ప్రాణభయంతో రక్షించాలంటూ ఆర్తనాదాలు చేశాయి.

వరద వస్తుందని వెనక్కి తగ్గలేదు.. బాధితులున్న చోటుకే వెళ్లారు!

పరిస్థితి తీవ్రత తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నేరుగా వరద ప్రాంతానికి చేరుకున్నారు. నడుములోతు నీటిలోకి దిగి బాధితుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ బాధిత



కుటుంబాలకు భరోసా కల్పిస్తూ రక్షణ చర్యలను వేగవంతం చేశారు.

ప్రాణరక్షణే ప్రథమ ప్రాధాన్యం..

వరదలో చిక్కుకున్న కుటుంబాలను బయటకు తీసుకొచ్చేందుకు లారీలు, ట్రాక్టర్లను రంగంలోకి దించారు. పార్టీ శ్రేణులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు. వరద ఉధృతి నిమిషనిమిషానికి పెరుగుతున్న నేపథ్యంలో సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన కొనసాగించారు.

రాత్రంతా అక్కడే.. బాధితుల కోసమే నిరీక్షణ!



వరదలో చిక్కుకున్న కుటుంబాల ఆర్తనాదాల మధ్య ఎమ్మెల్యే రాత్రంతా డబుల్ బెడ్‌రూమ్ నివాసాల సమీపంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రతి కుటుంబాన్ని సురక్షితంగా బయటకు తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలతో కలిసి క్షేత్రస్థాయిలో నిలిచారు.

ఒకవైపు ఉప్పొంగుతున్న వరద.. మరోవైపు ప్రాణభయంతో ఎదురుచూస్తున్న బాధిత కుటుంబాలు.. ఈ విపత్కర పరిస్థితుల్లో ఎమ్మెల్యే స్వయంగా వరదలోకి దిగి సహాయక చర్యలకు నాయకత్వం వహించడం అక్కడి పరిస్థితి తీవ్రతను తెలియజేసింది.

నకిలీ వినియోగదారుల సేవా కేంద్రాలు, పెట్టుబడి మోసాలు, తెరను పంచుకునే యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి -- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

"మీ డబ్బు -- మీ క్లిక్ -- మీ ఎంపిక" నినాదంతో నవంబర్ నెల మొత్తం జిల్లా వ్యాప్తంగా సైబర్ అవగాహన కార్యక్రమాలు




సైబర్ ఆర్థిక నేరాలను అరికట్టి ప్రజల్లో సురక్షితమైన డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించేందుకు నవంబర్ నెల మొత్తం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా "మీ డబ్బు -- మీ క్లిక్ -- మీ ఎంపిక" అనే నినాదంతో ప్రత్యేక సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు నిత్యం కొత్త పద్ధతుల్లో ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ వినియోగదారుల సేవా కేంద్రాల నంబర్లు, అధిక లాభాలు వస్తాయని ఆశ చూపే పెట్టుబడి పథకాలు, తెరను పంచుకునే యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు.ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ నేరాల సహాయ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ నరేష్, టేకులపల్లి సీఐ సత్యనారాయణ, ఎస్సై జుబేదా బేగం, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

తుఫాను బీభత్సం.. విద్యుత్ శాఖకు రూ.6 లక్షల నష్టం

భారీ వర్షాలకు నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు.
రూ.6 లక్షల నష్టం!.
విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి -- విద్యుత్ శాఖ హెచ్చరిక







చర్చ :- అశ్వారావుపేట.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు విద్యుత్ శాఖకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. గత 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడగా, విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఏర్పడింది.అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బి. వెంకట రత్నం తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మపేట మండల పరిధిలో నాలుగు 33 కేవీ విద్యుత్ స్తంభాలు, నాలుగు 11 కేవీ స్తంభాలు విరిగిపోయాయి. అదేవిధంగా అశ్వారావుపేట మండలంలో మూడు 33 కేవీ స్తంభాలు, పద్నాలుగు 11 కేవీ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ఘటనల వల్ల సుమారు రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు, ఓ అండ్ ఎం సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలు, ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని హెచ్చరించారు.ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా, స్తంభాలు ఒరిగిపోయినా వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

వరద నీటిలో అశ్వారావుపేట పట్టణం!
సంత మార్కెట్ నుంచి దొంతికుంట వరకు జలమయం.
నీట మునిగిన వ్యాపార సముదాయాలు.





చర్చ :- అశ్వారావుపేట.అశ్వారావుపేట పట్టణంలో ఏడితేరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలకు, వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. పట్టణ వ్యాప్తంగా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు సక్రమంగా బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపైకి, వ్యాపార సముదాయాల్లోకి వరద నీరు చేరింది. దీంతో పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాలు జలమయంగా మారాయి. ముఖ్యంగా సంత మార్కెట్ నుంచి దొంతికుంట వరకు ఉన్న ప్రధాన రహదారి పరిసరాల్లో వరద నీరు భారీగా నిలిచిపోయింది.పలు దుకాణాలు, వ్యాపార సముదాయాల్లోకి నీరు చేరడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుకాణాల్లో నిల్వ ఉంచిన సరుకులు తడిసిపోవడంతో ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రహదారులపై వరద నీరు ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు.ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే తరహా సమస్యలు ఎదురవుతున్నప్పటికీ పట్టణంలో శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పట్టణంలోని ప్రధాన కాలువలు, చిన్నపాటి డ్రైనేజీలు పూడికతో నిండిపోవడం, వర్షపు నీరు వెళ్లేందుకు సరైన మార్గాలు లేకపోవడం కూడా ముంపు సమస్యకు కారణమవుతున్నాయని పేర్కొంటున్నారు.పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో భవిష్యత్తులో వచ్చే భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర డ్రైనేజీ ప్రణాళిక రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం తాత్కాలిక చర్యలతో సమస్యను పరిష్కరించకుండా, సంత మార్కెట్ నుంచి దొంతికుంట వరకు వరద నీరు సులభంగా వెళ్లేలా శాశ్వత మురుగునీటి, వర్షపు నీటి కాలువల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో పరిశీలించి, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

నకిలీ కస్టమర్ కేర్ నంబర్లతో జాగ్రత్త!

పెట్టుబడి ఆశలు, స్క్రీన్ షేరింగ్ యాప్‌లతో సైబర్ మోసాలు..
ప్రజలకు ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరిక



చర్చ, జగిత్యాల, నవంబర్ 4:ఆన్‌లైన్‌లో చిన్నపాటి నిర్లక్ష్యం.. బ్యాంకు ఖాతాలోని డబ్బంతా ఖాళీ చేసే ప్రమాదం ఉందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. ప్రత్యేక సైబర్ అవగాహనా కార్యక్రమం లో భాగంగా ఎస్పీ మాట్లాడారు. నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, అధిక లాభాల ఆశ చూపే పెట్టుబడి పథకాలు, స్క్రీన్ షేరింగ్ యాప్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు.

"మీ డబ్బు -- మీ క్లిక్ -- మీ ఎంపిక" నినాదంతో నవంబర్ నెల మొత్తం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించవద్దని సూచించారు. అధిక లాభాల పేరుతో వచ్చే పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని వ్యక్తులు సూచించే స్క్రీన్ షేరింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని హెచ్చరించారు.

సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా ఎఎఎ.ఎఎఎవతీఎతీఅఎవ.స్ర్తశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు!

హైదరాబాద్ :
మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పేరు ఖరారైనట్లు తెలిసింది. మంగళవారం దిల్లీలో జరిగిన పార్లమెంటరీ బోర్డు సమావేశం సందర్భంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో రాంచందర్‌రావు అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ అధినాయకత్వం అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.గత అనుభవాన్ని పరిశీలించిన అధిష్ఠానంరెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు భారతీయ జనతా పార్టీ గత కొద్దిరోజులుగా కసరత్తు ముమ్మరం చేసింది. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే వారి పేర్లను సేకరించింది. ఒక్కో స్థానం నుంచి నలుగురి పేర్లతో అధిష్ఠానానికి ఆశావహుల లిస్ట్ పంపించారు.పలు అంతర్గత సర్వే రిపోర్టులను సమీక్షించి, రాష్ట్ర నాయకులతో సంప్రదించిన తర్వాత కేంద్ర నాయకత్వం మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావును ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ నియోజకవర్గంలో ఆయనకు గతంలో ఉన్న అనుభవం కారణంగా అంతర్గత సర్వేలు అనుకూలంగా ఉండడంతో రాష్ట్ర అధ్యక్షుడిని ఇక్కడి నుంచి పోటీలో నిలపాలని



పార్టీ నిర్ణయించినట్లు సమాచారం.ఉత్తర తెలంగాణ నుంచి బీసీ అభ్యర్థేవరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానం నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఎవరనేది మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ బీసీ అభ్యర్థికే అవకాశం ఇవ్వాలని పార్టీ అధినాయకత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో డాక్టర్ వన్నాల వెంకట రమణతో పాటు రిటైర్డ్ ఉపాధ్యాయుడు భిక్షం గౌడ్ పేరును పార్టీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. భిక్షం గౌడ్ సైతం త్వరలోనే బీజేపీలో చేరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.బీఆర్ఎస్ ఇంకా తేల్చలేదుతెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ ఇప్పటికే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. హైదరాబాద్-రంగారెడ్డి-ఖమ్మం-నల్గొండ నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్? రెడ్డిలను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించింది. తీన్మార్ మల్లన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ నుంచి పాలకూరి అశోక్? గౌడ్?ను ఆయన సిట్టింగ్ స్థానం నుంచి అభ్యర్థిగా ప్రకటించారు. ఇక బీఆర్ఎస్ ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించలేదు.ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చునని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. రెండు పట్టభద్రుల స్థానాల్లోని అర్హులు ఓటు కోసం ఈ నెల 6 వరకు ఫారం-18 సమర్పించాలని సీఈవో తెలిపారు. నవంబర్ 6వ తేదీ వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల డ్రాఫ్ట్ ప్రచురించిన తర్వాత ఈ నెల 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల సమయంలో కూడా ఓటు దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిశీలించి డిసెంబరు 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా ప్రచురణ చేస్తారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత కూడా నామినేషన్ల గడువు చివరి రోజు వరకు పట్టభద్రులు తమ ఓటును రిజిస్టర్ చేసుకోవడానికి దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు.

సింగరేణి డిస్మిస్డ్ ఉద్యోగులకు మరో అవకాశం



కాకతీయఖని(భూపాలపల్లి):
భూపాలపల్లి సింగరేణి ఏరియాలో డిస్మిస్డ్ ఉద్యోగులకు సంస్థ మరో అవకాశం కల్పించిందని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గైర్హాజరు కారణంగా 2023 నుంచి 2025 మధ్య విధుల నుంచి తొలగింపునకు గురైన వారిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకునేందుకు సంస్థ సిద్ధమైనట్టు పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించిందని తెలిపారు.ఇందుకు హైపవర్ కమిటీ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. 2026 ఏప్రిల్ నాటికి 46ఏళ్ల వయసు కలిగి ఉండటంతో పాటు గత ఐదేళ్లలో ఏవైనా రెండేళ్లలో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసిన వారు ఈ పునఃని యామకానికి అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు వైద్యపరంగా ఫిట్‌గా ఉండా లలని, ఈనెల 14లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

కరీంనగర్, వరంగల్ మధ్య 16 డీలక్స్ బస్సులు



హనుమకొండ: కరీంనగర్ నుంచి వరంగల్‌కు 16 డీలక్స్ నాన్‌స్టాప్ బస్సుల సేవలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ సర్వీస్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉద యం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ బస్సులు రాకపోకలు సాగనున్నాయి.ఈ డీలక్స్ నాన్‌స్టాప్ బస్సుల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సౌకర్యం వర్తించదు. సాధారణ బస్సులతో పోలిస్తే డీలక్స్ నాన్ స్టాప్ సర్వీసుల్లో ప్రయాణ సమయం తగ్గనుంది. డిపోలో 115 బస్సులు వరంగల్ -2 డిపో పరిధిలో ప్రస్తుతం కొత్త సర్వీస్‌లతో కలిపి మొత్తం 115 బస్సులు అందుబాటులో ఉన్నాయి.

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి - సీఎం సంతాపం - రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్ :టికెట్ చిల్లర విషయంలో ఆర్టీసీ బస్సులో తలెత్తిన వివాదం మహిళా కండక్టర్ ప్రాణాలను బలిగొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు డిపోనకు చెందిన కండక్టర్ గుండ్ల ప్రవళిక చికిత్స పొందుతూ మృతి చెందింది. చిల్లర విషయంలో కండక్టర్ ప్రవళికకు మరో మహిళా ప్రయాణికురాలితో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కోపంతో ఊగిపోయిన మహిళా ప్రయాణికురాలు, కదులుతున్న బస్సులోంచి కండక్టర్ ప్రవళికను బయటకు నెట్టేసింది. అనూహ్యంగా కిందపడిపోయిన కండక్టర్ కాళ్లపై నుంచి బస్సు వెనక చక్రాలు వెళ్లడంతో రెండు కాళ్లు నలిగిపోయాయి.పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రవళిక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం తుదిశ్వాస విడిచింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా



ఆసుపత్రికి తరలించారు. కాగా కండక్టర్ ప్రవళిక మృతి పట్ల ఆర్టీసీ కార్మికులు, యూనియన్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, ఆర్థిక సహాయంతో పాటు కుటుంబానికి అవసరమైన సహకారం అందించాలని యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీఎం సంతాపంకండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది.రూ. 10 లక్షల ఎక్స్?గ్రేషియా ప్రకటనమణుగూరు డిపో ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది. ఆమె తల్లికి ఉద్యోగంతో పాటు, ఇంటిని మంజూరు చేస్తామని తెలిపింది. ప్రవళిక మృతిపట్ల టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె అకాల మరణం ఆర్టీసీకి తీరని లోటని తెలిపారు. ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని నాగిరెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీతో ఆయన మాట్లాడారు. ప్రవళిక మృతికి నిరసనగా ఖమ్మం రీజియన్? వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు బంద్?కు పిలుపునిచ్చారు. బస్సులు నడవకపోవడంతో దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అసలేం జరిగిందంటే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మిట్టగూడెంనకు చెందిన ఓ ప్రయాణికురాలు గత నెల 25న మణుగూరు నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న మణుగూరు ఆర్టీసీ డిపోనకు చెందిన పల్లె వెలుగు బస్సు ఎక్కారు. ఆమెతో పాటు ఉన్న బాలుడికి టికెట్ తీసుకోవాలని మహిళా కండక్టర్ చెప్పారు.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు

హైదరాబాద్ : కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్ రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికా రు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచ ందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీబండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని య ప్రాజెక్టు లేదా విద్యాసం స్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయ పడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు

హైదరాబాద్ :తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరవని ఆయన విమర్శించారు. పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారు పరిశీలించారు.అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని



ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఈ నీటిని పంపింగ్ చేస్తే రైతుల పంటలను కాపాడవచ్చని ఆయన అన్నారు.బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులకు ఊరట: తెలంగాణలో ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువు పొడిగింపు



హైదరాబాద్ :తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువును ఎన్నికల సంఘం పొడిగించింది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల అర్హులైన పట్టభద్రులు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు తమ ఓటును నమోదు చేసుకునే అవకాశం లభించింది.ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాలకు ఈ గడువు పొడిగింపు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా సర్వర్ సమస్యల కారణంగా ఆన్‌లైన్ పోర్టల్ మొరాయించడంతో, పలు రాజకీయ పార్టీలు, పట్టభద్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి దరఖాస్తులకు నవంబర్ 6 ఆఖరి తేదీ అయినప్పటికీ, తాజా పరిస్థితుల దృష్ట్యా ఆ గడువును పొడిగించారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్కామ్.. ఏపీ, తెలంగాణలో ఈడీ మెరుపుదాడులు

హైదరాబాద్ :ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో ఈడీ దూకుడు
మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంలోనూ సోదాలు
మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు
ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ ఉదయం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తోంది.ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి, మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాలు, మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్ సహా మొత్తం ఏడు చోట్ల ఈ తనిఖీలు జరుగుతున్నాయి. ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు.గత ప్రభుత్వ హయాంలో 2018లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. 2020లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. అయితే, జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు




జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరిపిన సిట్... మంగళగిరి వద్ద హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో 84 రోజుల పాటు మూల్యాంకనం చేశారని, అర్హత లేని 66 మందితో జవాబు పత్రాలను దిద్దించారని తన నివేదికలో తేల్చింది.ఈ మూల్యాంకనం కోసం క్యామ్‌సైన్ మీడియాకు రూ.1.14 కోట్లు, ఇతర సంస్థలకు రూ.1.38 కోట్లు చెల్లించినట్టు సిట్ గుర్తించింది. ఈ నివేదిక ఆధారంగా 2025 ఏప్రిల్‌లో పోలీసులు కేసు నమోదు చేయగా, గతంలో పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్‌ను అరెస్ట్ చేశారు. సిట్ దర్యాప్తు నివేదిక ఆధారంగానే, ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి, తాజాగా సోదాలు చేపట్టింది.

ఈడీ విచారణకు హాజరైన అంబటి రాంబాబు



వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. మద్యం రవాణా కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేస్తున్నారు.ఈ కేసులో విచారణకు రావాలని గతంలోనే ఈడీ అంబటికి నోటీసులు ఇచ్చింది. అయితే, తనకు ఇటీవల గుండెకు స్టెంట్లు వేశారని, అనారోగ్య కారణాలతో హాజరుకాలేనని ఆయన వైద్య నివేదికలతో పాటు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో, నవంబర్ 4న తప్పనిసరిగా విచారణకు రావాలని ఈడీ మరోసారి నోటీసులు జారీ చేయడంతో ఆయన హైదరాబాద్‌లోని కార్యాలయానికి వచ్చారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్లలో భారీగా అవకతవకలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 195 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసులో దర్యాప్తు చేస్తోంది. కొందరికి అనుకూలంగా టెండర్ నిబంధనలు మార్చారని ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కేసులో ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు కెసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌లను ఈడీ అరెస్ట్

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాలే లక్ష్యం. చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి, నవంబర్ 04: రానున్న ఎన్నికల్లో అన్ని జిల్లా పరిషత్, ఎంపీపీ స్థానాలు దక్కించుకోవాలని పార్టీ శ్రేణులకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బుధవారం రాజధాని అమరావతిలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై వారికి ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలకు మనం అండగా నిలిస్తే.. వారు మనతోనే ఉంటారని స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల ద్వారా నిరూపితమైందని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన నేతలు, కార్యకర్తలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతం స్ట్రెయిక్ రేట్ సాధించామని అన్నారు.వారికి నామినేటెడ్ పోస్టులు..మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో దక్కిన విజయం.. మన బాధ్యతను పెంచిందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ ఫలితాలు కూటమి సంక్షేమం – అభివృద్ధి – సుపరిపాలనకు గుర్తింపు అని అభివర్ణించారు. స్థానిక ఎన్నికల్లో సీట్లు దక్కించుకోలేని వారికి నామినేటెడ్ పోస్టులతో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో అనుకున్న విధంగానే ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. గుడ్ గవర్నెన్స్.. గుడ్ పాలిటిక్స్ ఇదే కూటమి ప్రభుత్వ విధానం అని తెలిపారు.కూటమి ప్రభుత్వ కష్టాన్ని గుర్తించిన ప్రజలు.ప్రజలకు మంచి చేస్తే.. అన్ని స్థాయిల్లోనూ వారు గుర్తిస్తారని.. మన వెన్నంటే ఉంటారని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఈ విషయాన్ని నిరూపిం చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పడుతోన్న కష్టాన్ని ప్రజలు గుర్తించారని వివరిం చారు. మంచికి.. మంచి ప్రభు త్వానికి అండగా ఉంటామని ఈ ఫలితాల ద్వారా ప్రజలు చాటి చెప్పారని అన్నారు. మరింత చక్కటి పాలనను అందించేందుకు ప్రోత్సహాన్ని ఇస్తూ ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు.ఈ ఎన్నికల్లో 94 శాతం స్ట్రెయిక్ రేట్..పట్టణ స్థానిక ఎన్నికల్లో కూడా 94 శాతం స్ట్రెయిక్ రేట్ సాధించగలిగామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ఓడిపోయిన కొన్ని చోట్ల కూడా కూటమి పార్టీలకు చెందిన రెబెల్సే గెలిచారని గుర్తు చేశారు. స్థానికంగా ఉన్న చిన్నపాటి సమన్వయ లోపాల వల్ల కొన్ని స్థానాలు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ కూటమి పార్టీల అభ్యర్థులు ఘన విజయం సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమం – అభివృద్ధి – సుపరిపాలన ధ్యేయంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామని అన్నారు. అందుకే చరిత్ర సృష్టించాం..ఆర్థిక వ్యవస్థ దివాళా తీసినా సంక్షేమాన్ని అందిస్తున్నామని.. మరో పక్క అభివృద్ధి చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. డీఎస్సీతో టీచర్ల రిక్రూట్మెంట్ల సహా జాబ్ క్యాలెండర్ ద్వారా వివిధ శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలతో మమేకం అవుతూ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. అందుకే చరిత్ర సృష్టించామని సీఎం చంద్రబాబు సోదాహరణగా చెప్పారు.మిత్రపక్షాలను గౌరవించుకోవాలి..రాష్ట్రానికి.. తమకు న్యాయం చేయాలనే ప్రజలు కూటమికి పట్టం కడుతున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. మిత్రపక్షాలను గౌరవించుకోవాలి.. కూటమిలోని ఏ పార్టీ అభ్యర్థి అయినా మన అభ్యర్థే అన్నట్టుగా పని చేయాలని కేడర్‌కు సూచించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను మించి జెడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాలను గెలవాలని వారికి దిశానిర్దేశం చేశారు. చిన్నపాటి పొరపాటు కూడా జరగకూడదని.. పూర్తి సమన్వయంతో పని చేయాలని పార్టీ నేతలను ఈ సందర్భంగా అప్రమత్తం చేశారు.

ఏపీ ఒడిశా పోలీసులు- కొఠియా గ్రామాల్లో మళ్లీ ఉద్రిక్తతలు



అమరావతి, :ఆంధ్రా– ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొఠియా గ్రామాల్లో మరోసారి ఉద్రిక్తత రాజుకుంది. గంజాయిభద్ర పంచాయతీ పరిధిలోని నేరళ్లవలస, దొరలతాడివలస, నేలవలస గ్రామాల్లో ఆధిపత్య వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. నేరళ్లవలసకు నవంబరు నెల రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు సోమవారం రాత్రి వెళ్లిన జీసీసీ వాహనాన్ని ఒడిశా పోలీసులు అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. రేషన్ సరఫరా వివాదానికి తోడు స్థానిక ఎన్నికల వ్యవహారం ఆంధ్రా– ఒడిశా సరిహద్దులోని కొఠియా గ్రామాల్లో చిచ్చు రేపుతోంది.తమకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అడ్డుకోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరళ్లవలసకు చేరుకుని ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన జెట్‌పోస్టు వద్ద పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బారికేడ్లు తొలగించాలని, అక్కడ ఏర్పాటు చేసిన టెంట్‌ను తీసేయాలని డిమాండ్ చేశారు. వివాదం ముదరడంతో అదనపు పోలీసు బలగాలు గ్రామానికి చేరుకున్నాయి. అదే సమయంలో ఒడిశా ప్రభుత్వానికి చెందిన రాజకీయ నాయకులు, వారి అనుచరులు సుమారు 60 మంది అక్కడికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఒడిశా ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తున్న కొందరు గిరిజనులపై వారు దాడికి పాల్పడినట్లు ఆరోపిస్తున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా భయపడేలా చేశారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం కల్పించాలని, పోలీసులు తమ గ్రామాన్ని విడిచి వెళ్లాలని స్థానికులు కోరినా పరిస్థితిలో మార్పు రాలేదని చెబుతున్నా రు.రాజకీయ నాయకులే ఒత్తిడి తెస్తున్నారు : స్థానికులుఏపీలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటు వేయవద్దంటూ ఒడిశా అధికారులు, రాజకీయ నాయకులు ఒత్తిడి తెస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆంధ్రాలో ఓటు వేయకుండా అడ్డుకునే ందుకు పెద్ద సంఖ్యలో గ్రామానికి వచ్చి హెచ్చరించినట్లు చెబుతున్నారు. తమకు రెండు రాష్ట్రాలతోనూ అనుబంధం ఉందని, రెండు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఓటు హక్కు వినియోగించుకుంటామని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒత్తిళ్లపై ఆగ్రహంతో కొందరు ఒడిశాకు చెందిన ఆధార్, రేషన్ కార్డులను అధికారుల ఎదుట పడేసినట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యం సరఫరా అడ్డంకి నుంచి మొదలైన వివాదం ఇప్పుడు పోలీసు బలగాలు, రాజకీయ నాయకుల జోక్యంతో మరింత తీవ్రమైంది. ఒకవైపు గ్రామస్థుల నిత్యావసరాల సరఫరా, మరోవైపు ఓటు హక్కు అంశాలు వివాదానికి కేంద్రంగా మారాయి. ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో నేరళ్లవలసతో పాటు పరిసర గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. కొఠియాలోని 21 గ్రామాల్లో 5 ఎంపీటీసీ స్థానాలకు ఏపీ అధికారులు ఐదు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో మొత్తం 2,883 మంది ఓటర్లు ఉండగా, 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.ఇదిలా ఉండగా, కొఠియా ప్రజలు ఈ ఎన్నికలను వ్యతిరేకిస్తున్నారని రెవెన్యూ మంత్రి సురేశ్ పూజారి తెలిపారు. 'ఎన్నికల రోజున అన్ని పార్టీల నాయకులు ఏకమై కొఠియాను కాపాడాలని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయించారు.ప్రభుత్వ యంత్రాంగం కొఠియా ప్రజలకు అండగా నిలిచిందని విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారు. వెలుపల, అంటే ఆంధ్ర సరిహద్దుల లోపల పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మా యంత్రాంగం పూర్తిగా సన్నద్ధంగా ఉంది" అని సురేశ్ పేర్కొన్నారు.

వంగవీటి రాధా గెలుపు చరిత్రాత్మకం



విజయవాడ :విజయవాడ నూతన మేయర్‌గా కూటమి అభ్యర్థి వంగవీటి రాధా ఘన విజయం సాధించారు. జనసేన తరపున పోటీ చేసిన ఆయన భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని స్పందిస్తూ... రాధాకు శు భాకాంక్షలు తెలిపారు. విజయవాడ ప్రజలు వంగవీటి రాధాకు పట్టం కట్టారని, ఈ గెలుపు చరిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు.ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదై నప్పటికీ, ప్రజలు కూటమికి అపూర్వమైన విజయాన్ని అందించారని చిన్ని కొనియాడారు. "ఓటింగ్ శాతం కాస్త పెరిగి ఉంటే మెజార్టీ రెండు లక్షలు దాటి ఉండేది. ఈ విజయం మాపై మరింత బాధ్యతను పెంచింది" అని ఆయన వ్యాఖ్యానించారు.విజయవాడ అభివృద్ధి కోసం, మేయర్‌గా ఎన్నికైన రాధాతో కలిసి అందరూ సమష్టిగా కృషి చేస్తామని కేశినేని చిన్ని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు ఎంతో విశ్వాసాన్ని ప్రదర్శించారని, ఈ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసు.. నిందితుల నివాసాల్లో ఈడీ సోదాలు

అమరావతి, నవంబరు 4 :ఏపీపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకన అక్రమాల కేసులో బుధవారం ఉదయం నుంచి ఈడీ సోదాలు చేస్తోంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్ మధుసూదనరావు నివాసాల్లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌తో పాటు మూల్యాంకనం జరిగిన మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్టులో కూడా ఈ సోదాలు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 మూల్యాంకన వ్యవహారంపై మనీలాండరిం గ్ కోణంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. గ్రూప్-1 మూల్యాంకనంతో సంబంధం ఉన్న క్యామ్‌సైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల ఆర్థిక లావాదేవీలపై ఈడీ దృష్టి పెట్టింది. గ్రూప్-1 మూల్యాంకనానికి చెల్లించిన నిధులు, కాంట్రాక్టుల కేటాయింపులు, ఆర్థిక అక్రమాల ఆరోపణలపై విచారణ జరుపుతోంది.2018లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 2020 డిసెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. వాటి జవాబు పత్రాలకు డిజిటల్ మూల్యాంకనంతో పాటు రెండు దశల్లో మాన్యువల్ మూల్యాంకనం జరిగినట్లు సిట్ నివేదిక తెలిపింది. మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో 84 రోజుల పాటు జవాబు పత్రాల మూల్యాంకనం జరిగినట్లు సిట్ గుర్తించింది. అర్హతలేని 66 మందితో గ్రూప్-1 మూల్యాంకనం చేయించారని సిట్ ఆరోపించింది.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ప్రణాళిక: ఏపీ ఎస్ఈసీ



అమరావతి, నవంబరు 4 : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ప్రణాళిక అమలు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా (ూస్రా నాజుజూాఅశ్రీ జష్ట్రుఅంతీఖ్ర జాబఅవవీష్ట్రుు) స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మెజారిటీ ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రకటించారు. మురసు తుఫాన్, వాతావరణ పరిస్థితులపై జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఈరోజు (బుధవారం) విజయవాడలో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై ఎస్ఈసీ దిశానిర్దేశం చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు అన్ని శాఖల సమన్వయం తప్పనిసరని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా మార్గనిర్దేశం చేశారు.అలాగే, పోలింగ్ సిబ్బంది నియామకం, ఏర్పాట్ల గురించి ఏపీ ఎన్నికల కార్యదర్శి డా. ఏ. మల్లికార్జున మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు 2.52 లక్షల మంది, కౌంటింగ్ కోసం 52 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని వెల్లడించారు. పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాల పోలింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఆయా పరిస్థితుల ఆధారంగా పోలింగ్ కేంద్రాల లోపలా వీడియోగ్రఫీకి అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా సంబంధిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. ఏపీలో 2.61 కోట్లకు ఓటర్ల సంఖ్య చేరిందని.. మైక్రో లెవెల్ ప్లానింగ్‌తో ఎన్నికలను నిర్వహిస్తామని మల్లికార్జున పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల శాంతిభద్రతలు, పోలీసు బందోబస్తు గురించి ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. ఒకే దశలో పోలింగ్ జరుగుతున్నందున ఆయా కేంద్రాల వద్ద ప్రజల రద్దీ నివారణకు తగినంతగా పోలీసు బలగాలను మోహరించామని చెప్పుకొచ్చారు. సెక్టార్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాల గురించి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 9,821 ఎంపీటీసీ స్థానాలకు గానూ 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. మిగిలిన 7,770 ఎంపీటీసీ స్థానాలకు 18,843 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మైలవరపు కృష్ణ తేజ వెల్లడించారు.

ఉమ్మడి అనంత మున్సిపాలిటీలన్నీ కూటమికే



అనంతపురం, పుట్టపర్తి, : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పురపాలక సంఘాలన్నీ కూటమి ఖాతాలో పడ్డాయి. అయితే అనంతపురం కార్పొరేషన్ మాత్రం వైసీపీ ఖాతాలో పడింది. ఆ పార్టీ అభ్యర్థి చిట్లూరు రమేశ్‌గౌడ్ విజయం సాధించారు. అయితే ఇక్కడి 62 వార్డులకు గాను టీడీపీ 31, జనసేన 6, బీజేపీ 1 (మొత్తం 38) మెజారిటీ వార్డులు దక్కించుకున్నాయి. వైసీపీ 20 మాత్రమే గెలుచుకుంది. ఇక్కడ కూటమి పార్టీల నుంచి క్రాస్ ఓటింగ్ జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఇక శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి చైర్మన్‌గా జనసేన అభ్యర్థి మేకల ఈశ్వర్ గెలిచారు.మడకశిర నగర పంచాయతీలో జనసేన అభ్యర్థి గుండుమల శారద, పెనుకొండలో టీడీపీ అభ్యర్థి త్రివేంద్రమూర్తి, హిందూపురంలో టీడీపీ అభ్యర్థి పురిడి మంజునాథ్, కదిరిలో టీడీపీ అభ్యర్థి షేక్ అర్షియా బాను, ధర్మవరంలో టీడీపీ అభ్యర్థి పరిశె సుధాకర్ గెలుపొందారు. అనంతపురం జిల్లా గుత్తి చైర్‌పర్సన్‌గా టీడీపీకి చెందిన గోవిందరాజుల తమిళసెల్వి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంతకల్లులో టీడీపీ అభ్యర్థి ఆర్.యశోద గౌడ్, కల్యాణదుర్గంలో టీడీపీ అభ్యర్థి బుట్నా లక్ష్మి, రాయదుర్గంలో టీడీపీ అభ్యర్థి టెంకశాల హనుమంతు, తాడిపత్రిలో టీడీపీకే చెందిన రేష్మా పర్వీన్ చైర్‌పర్సన్లుగా ఎన్నికయ్యారు. గుత్తిలోని మొత్తం 32 వార్డులూ కూటమికే దక్కాయి.వీటిలో 29 టీడీపీకి, జనసేనకు 2, బీజేపీకి ఒకటి దక్కాయి. గుంతకల్లు వార్డుల్లో వైసీపీ గట్టి పోటీయే ఇచ్చింది. 48 వార్డులకు గాను 15 దాని ఖాతాలో పడ్డాయి. టీడీపీ 24, బీజేపీ 1 గెలుచుకున్నాయి. 8 మంది స్వతంత్రులు గెలిచారు. తాడిపత్రిలోని 48 వార్డులూ కూటమికే దక్కాయి. వైసీపీకి ఒక్కటి కూడా రాలేదు. కదిరి, మడకశిర, పెనుకొండ ల్లోనూ ఆ పార్టీ ఖాతా తెరవలేదు.జనసేన టికెట్ దక్కక..ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ సీటు పొత్తులో భాగంగా టీడీపీకి దక్కింది. ఆ పార్టీ తరఫున టి.మణి బరిలోకి దిగారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప తన భార్య స్వప్న నాయకర్‌ను స్వతంత్ర అభ్యర్థిగా నిలిపారు. 52 వార్డులకు గాను టీడీపీ 30 చోట్ల గెలిచినా మణి గెలవలేకపోయారు. స్వప్నకు అనుకూలంగా క్రాస్‌ఓటింగ్ జరిగింది. డోన్ చైర్‌పర్సన్‌గా టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ స్వల్ప ఆధిక్యంతో విజయం సాధించారు. నందికొట్కూరు మున్సిపాలిటీలో వైసీపీ (ఫాతిమాబీ) విజయం సాధించింది. నంద్యాల లో కడపటి వార్తలు అందేసరికి.. టీడీపీ అభ్యర్థి బాబన్ ముందంజలో ఉన్నారు. 52 వార్డుల్లో టీడీపీ-25, వైసీపీ-27 గెలుపొందాయి. బాబన్‌కు అనుకూలంగా క్రాస్‌ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది.

ఒంగోలు మేయర్ పీఠం టీడీపీ కైవసం.. 37 వేల ఓట్ల భారీ మెజారిటీతో శ్రీశిల్ప ఘన విజయం



ఒంగోలు : ఒంగోలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించింది. మేయర్ పీఠాన్ని టీడీపీ అభ్యర్థి నల్లమల్లి శ్రీశిల్ప కైవసం చేసుకున్నారు. తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి కుప్పం ప్రసాద్‌పై ఆమె 37,172 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. బుధవారం మధ్యాహ్నం వెలువడిన ఫలితాలతో ఒంగోలు కార్పొరేషన్‌పై టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి జెండా ఎగిరింది.ఈ ఎన్నికల్లో కూటమి పూర్తి ఆధిపత్యం కనబరిచింది. మొత్తం డివిజన్లలో తెలుగుదేశం పార్టీ 39 స్థానాల్లో గెలుపొందగా, మిత్రపక్షమైన జనసేన పార్టీ 8 డివిజన్లలో, బీజేపీ ఒక డివిజన్‌లో విజయం సాధించాయి. మరోవైపు, అధికార వైసీపీ కేవలం 11 డివిజన్లకే పరిమితమైంది. మరో మూడు డివిజన్లలో ఇతరులు గెలుపొందారు. దీంతో కార్పొరేషన్ కౌన్సిల్‌లో టీడీపీ కూటమికి స్పష్టమైన మెజారిటీ లభించింది.'మురసు' తుపాను కారణంగా ఒంగోలు నగరపాలక సంస్థ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆలస్యమైంది. తుపాను ప్రభావంతో వాయిదా పడిన కౌంటింగ్‌ను ఇవాళ పూర్తి చేసి, మధ్యాహ్నం తర్వాత అధికారులు తుది ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ విజయంతో ఒంగోలు నగరంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

రూ.2 కోట్ల లంచం ఆరోపణలు.. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



న్యూ ఢిల్లీ :సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం అనుమతి 2006 నాటి లంచం ఆరోపణలపై దర్యాప్తు రూ.2 కోట్లు డిమాండ్ చేశారని కాంట్రాక్టర్ సాజన్ ఫిర్యాదు సెక్షన్ 17(ఏ) కింద విచారణకు ఆమోదం ముఖ్యమంత్రి సతీశన్‌తో చర్చించినట్లు హోంమంత్రి వెల్లడి కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో కేరళం ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అనుమతించింది. 2006లో కేరళం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ కాంట్రాక్టు బిల్లులు క్లియర్ చేసేందుకు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది.అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతించినట్లు రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితల బుధవారం వెల్లడించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతుందని చెప్పారు.మలేసి యాకు చెందిన ఇంజినీర్ లీ సీ బిన్ నుంచి జ్ఞానేశ్‌కుమార్ రూ.2 కోట్లు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ వీ.ఓ. సాజన్ గతంలో ఆరోపించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు (కేఎస్‌టీపీ) పనులు చేపట్టిన పాథిబెల్ సంస్థకు లీ సీ బిన్ అనుబంధంగా పనిచేశారు. ఆ సంస్థకు సాజన్ సబ్ కాంట్రాక్టర్‌గా మెటీరియల్ సరఫరా చేసేవారు.పెండింగ్‌లో ఉన్న బిల్లులను జ్ఞానేశ్‌కుమార్ నిలిపివేసి, వాటిని విడుదల చేయడానికి రూ.2 కోట్లు అడిగారని సాజన్ మీడియాకు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో లీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, ఈ విషయాన్ని తనతో చెప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం లీ ఆత్మహత్య చేసుకుని మరణించారు.జ్ఞానేశ్‌కుమార్ ప్రస్తుతం సీఈసీగా ఉన్నప్పటికీ, గతంలో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని చెన్నితల స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా విచారణకు ఆటంకం లేదని చెబుతున్నాయని అన్నారు. సీఈసీ పదవికి సంబంధించిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు.గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ జ్ఞానేశ్‌కుమార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకే ఉద్దేశించినట్లు సాజన్ ఆరోపించారు. తాజా అనుమతితో ఈ వ్యవహారంపై మరోసారి విచారణకు మార్గం సుగమమైంది.చిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు.గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ జ్ఞానేశ్‌కుమార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకే ఉద్దేశించినట్లు సాజన్ ఆరోపించారు. తాజా అనుమతితో ఈ వ్యవహారంపై మరోసారి విచారణకు మార్గం సుగమమైంది.

ఓటర్ల జాబితాలో పేరులేని వారు ఫాం 6 ద్వారా అప్లై చేసుకోవచ్చు: ఈసీ



ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ తర్వాత పబ్లిష్ అయిన ఓటరు జాబితాలో పేరు కోల్పోయిన వారు ఫాం 6 ద్వారా కొత్తగా అప్లై చేసుకోవచ్చని ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. అలాంటి వారు అంతకుముందు ఓటర్లుగా నమోదై ఉన్నా కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈనెల 3న లేఖ రాసింది. ఫాం 6 ద్వారా కొత్తగా అప్లై చేసినా.. చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోబోమని, అలా దరఖాస్తు చేసినంతమాత్రాన తప్పుడు డిక్లరేషన్ ఇచ్చినట్లు కాదని ఈసీ వివరించింది. కాగా.. కొత్తగా విడుదల చేసిన ఓటరు జాబితాలో పలువురు ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయి. దీంతో అలాంటి వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి సందేహిస్తున్నారు. ఫాం 6 ద్వారా అప్లై చేస్తే తమను ఓటరు జాబితాలో మొదటిసారిగా చేరుస్తారన్న సందేహం వారిలో నెలకొంది. ఈ నేపథ్యంలో ఈసీ క్లారిటీ ఇచ్చింది.ఓటరు జాబితాలో పేరులేని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందేనని, ఇలా చేయడం వల్ల ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని, వారు పాత ఓటర్లు అయి ఉన్నా కూడా ఇబ్బందులు ఉండవని ఈసీ స్పష్టం చేసింది. సెక్షన్ 31 కింద ఎలాంటి చర్యలు తీసుకోరాదని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, దరఖాస్తుదారులు మరో పార్లమెంటరీ నియోజకవర్గంలోగానీ, అసెంబ్లీ నియోజకవర్గంలో గానీ ఓటరుగా నమోదై ఉండకూడదని ఈసీ తెలిపింది. కాగా.. సర్ ప్రక్రియ తర్వాత విడుదల చేసిన ఓటర్ల జాబితాలో చాలా మంది ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని భారీగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈసీ ఈ మేరకు ఒక క్లారిటీ ఇచ్చింది.

సీఆర్పీఎఫ్‌ను కొట్టిన మహిళా యూట్యూబర్.. కేసు నమోదు చేసిన పోలీసులు



న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలో లెహ్రో దో తిరంగా నిరసన ప్రదర్శన జరిగిన విషయం తెలిసిందే. పాలికా బజార్ వద్ద జరిగిన నిరసనలో ఓ మహిళా యూట్యూబర్.. పారామిలిటరీ సైనికుడిపై చేయి చేసుకున్నారు. సెంట్రల్ ఢిల్లీలోని రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న గేట్ నెంబర్ 6 దగ్గర ఈ ఘటన జరిగింది. సీఆర్పీఎఫ్ జవానును, అక్కడ ఉన్న గుంపు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో ఓ మహిళ జవాన్ చెంపపై కొట్టింది. నిరసన పేరుతో పోలీసులు, పారామిలిటరీ దళాలపై దాడి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఓ సీఆర్పీఎఫ్ జవాన్‌ను కొట్టిన ఘటనకు చెందిన వీడియోను ఢిల్లీ పోలీసులు రిలీజ్ చేశారు. దాడిలో పాల్గొన్న నిరసనకారులు, యూట్యూబర్లను గుర్తిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

ప్రధాని మోదీ 'దేశద్రోహి' అని ఐదు నిమిషాల్లోనే నిరూపిస్తా


న్యూ ఢిల్లీ : టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్ర శేఖరన్ పునర్నియామకం నేపథ్యంలో చెలరేగిన వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థా యిలో విరుచుకుపడ్డారు. భారతీయ వ్యాపార రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ ఆటవస్తువులా చూస్తున్నారని ఆరోపించారు. దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు ఈ విమానాశ్రయాలను నిర్వహించడానికి భయపడుతున్నారని 'ఎక్స్' వేదికగా తెలిపారు."టాటా సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారు. అయినా ఒక్క వ్యాపారవేత్త కూడా దీనిపై మాట్లాడడానికి సాహసించడం లేదు. మీరు ఇంకెంత కాలం మౌనంగా ఉంటారు? వాళ్లు మిమ్మల్ని పూర్తిగా లొంగదీసుకునేంత వరకా? భారతీయ వ్యాపార రంగం మోదీ, షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, కానీ మాకు ఉంది. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా మేము కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తాం." అని రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు.టాటా సన్స్ బోర్డు



సమావేశంలో చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని ఆమోదించిన విధానంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయల్ టాటా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వివాదం చెలరేగింది. అజెండాలో స్పష్టంగా పేర్కొనకుండానే సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. అనేక సార్లు కోరినా సమావేశానికి సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను కూడా తనకు అందించడం లేదని నోయల్ టాటా ఆరోపించారు. టాటా సన్స్ కంపెనీ సెక్రటరీ, గ్రూప్ కార్పొరేట్ సెక్రటరీ అయిన సుప్రకాష్ ముఖోపాధ్యాయకు అక్టోబర్ 26న రాసిన లేఖలో నోయెల్ టాటా ఈ మేరకు పేర్కొన్నారు. ఈ నియామక తీర్మానం చట్టబద్ధం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ పునర్?నియామకం టాటా సన్స్ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని సంబంధిత నిబంధనలకు అనుగుణంగా లేదని ఆయన వాదించారు. నోయెల్ ప్రకారం టాటా విషయంలో ఆర్టికల్ 118 కింద ఎటువంటి ఎంపిక కమిటీని ఏర్పాటు చేయలేదు, అలాంటి కమిటీ నుంచి వచ్చిన సిఫార్సును కూడా బోర్డు ముందు ఉంచలేదు. ఆర్టికల్ 118, 121 ప్రకారం అవసరమైన విధంగా ఆర్టికల్ 104బి కింద నియమించిన డైరెక్టర్ల అనుకూల ఓటును పొందలేదని అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేఖ, సంబంధిత కేవియట్ దరఖాస్తులపై చర్చలను చేర్చడానికి అజెండాను తదనంతరం సవరించినప్పటికీ, అది చంద్ర శేఖరన్ పునర్ నియామకాన్ని స్పష్టంగా ప్రస్తావించలేదన్నారు. టాటా ట్రస్ట్స్ ఆధ్వర్యంలో 15 దాతృత్వ సంస్థలు ఉండగా, అందులో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్స్, సర్ రతన్ టాటా ట్రస్ట్స్ కీలకమైనవి. వాటానే 51.54 శాతంగా ఉంది. అందుకే ఈ ట్రస్ట్‌ల ట్రస్టీల అభిప్రాయాలు టాటా పాల నా ప్రభావం చూపుతుంటాయి.

అగ్నివీర్‌లకు సేవా కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తున్నట్లు కేంద్రం ప్రకటన

ఢిల్లీ :కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'అగ్నిపథ్' పథకంలో భాగంగా అగ్నివీర్‌ల సేవా కాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తున్నట్లు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (జనా) జనరల్ ఎన్. ఎస్. రాజా సుబ్రమణి తెలిపారు. ఈ పథకం కింద నాలుగేళ్ల ప్రాథమిక పదవీ కాలం ముగిసిన తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మంది అగ్నివీర్‌లకు అదనంగా మరో రెండేళ్లపాటు సేవలు అందించే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. ఈ అదనపు రెండేళ్ల పొడిగింపు గడువు పూర్తైన తర్వాత ఆసక్తి గల అగ్నివీర్‌లు సాయుధ దళాల్లో చేరవచ్చని వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని సీడీఎస్ జనరల్ ఎన్.ఎస్. రాజా మీడియాకు బుధవారం తెలియజేశారు."భారత రక్షణ దళాలకు, అగ్నివీర్‌లకు బుధవారం చాలా ముఖ్యమైన రోజు. అగ్నివీరులందరూ భారత సాయుధ దళాల్లో శాశ్వతంగా చేరేందుకు వీలుగా కేంద్ర కేబినెట్ మార్గాన్ని సుగమం చేసింది. 2022 జూన్ 14న అగ్నిపథ్ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. అప్పట్లోనే అగ్నివీర్‌ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని, ఈ



పథకాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని పేర్కొంది. ఇప్పుడు మొదటి బ్యాచ్ అగ్నివీర్‌ల నాలుగేళ్ల పదవీ కాలం ముగింపు దశకు చేరుకుంది. ఈ నాలుగేళ్లలో వారి పనితీరుపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ప్రతిభ ఆధారంగా 25శాతం మంది అగ్నివీర్‌లను రక్షణ దళాల్లో (రెగ్యులర్ ఫోర్సెస్) చేర్చుకోవాల్సి ఉంది. గత నిబంధనల ప్రకారం మిగిలిన 75శాతం మంది అగ్నివీర్‌లు క్రమశిక్షణ కలిగిన, ఉత్సాహవంతులైన యువకులుగా తిరిగి సమాజంలోకి వెళ్లాల్సి ఉండేది. అయితే ఇప్పుడు కేంద్రం తాజాగా అగ్నిపథ్ పథకాన్ని సవరించింది. ఆ 75 శాతం అగ్నివీర్‌లకు అదనంగా మరో రెండేళ్ల పాటు సైన్యంలో పనిచేసే చేసే అవకాశం కల్పించింది. ఈ రెండేళ్ల కాలం పూర్తైన తర్వాత ఆసక్తి ఉన్న వారందరినీ నిర్దిష్ట ఎంపిక ప్రమాణాలకు లోబడి సాయుధ దళాల్లో చేర్చుకుంటుంది." అని సీడీఎస్ జనరల్ ఎన్. ఎస్. రాజా సుబ్రమణి పేర్కొన్నారు.ప్రోత్సహించడమే లక్ష్యంగా 'అగ్నిపథ్' పథకాన్ని కేంద్రం 2022లో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఎంపికైన అగ్నివీర్‌లు నాలుగేళ్ల పాటు సైన్యంలో సేవలు అందించిన తర్వాత వారి ప్రతిభ, సంస్థాగత అవసరాల ఆధారంగా కేవలం 25శాతం మంది మాత్రమే సాయుధ దళాల్లో శాశ్వత నియామకానికి అర్హత పొందుతారు. మిగిలిన 75 శాతం మంది పౌర ఉద్యోగాలలో చేరడానికి వీలుగా ఆర్థిక ప్యాకేజీ, నైపుణ్య ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం నుంచి పొందుతారు. అగ్నివీర్‌ల నియామక కాలం తక్కువగా ఉండటంపై గతంలో విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో యూపీ, హరియాణా, మహారాష్ట్ర వంటి పలు రాష్ట్రాలు పోలీస్, ఇతర ఉద్యోగాల్లో అగ్నివీర్‌లకు రిజర్వేషన్లు కల్పించేందుకు ముందుకొచ్చాయి. దీంతో అగ్నివీర్‌ల సేవా కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

వలస కార్మికులందరూ తిరిగి రండి.. బెంగాల్ సీఎం పిలుపు

బెంగాల్ :



పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన కార్మికులు తిరిగి రావాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలవుతున్న వీబీ జీ రామ్ జీ పథకం కింద కార్మికులందరికీ 125 రోజుల పాటు కచ్చితంగా ఉపాధి కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. 'ఇప్పుడు వీబీ జీ రామ్ జీ పథకం అమలవుతోంది. దీని కింద కార్మికులకు కచ్చితంగా ఉపాధి కల్పిస్తాం. కాబట్టి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన కార్మికులంతా తిరిగి బెంగాల్‌కు రండి. సొంత రాష్ట్రంలో పని చేసుకుంటూ కుటుంబంతో కలిసి ఉండండి' అంటూ సువేందు అధికారి పేర్కొన్నారు. (బుధవారం) పంచాయతీ శాఖ సమావేశానికి హాజరైన ఆయన.. వలస కార్మికుల కోసం ఈ పిలుపునిచ్చారు.పంచాయతీ శాఖ సమావేశంలో బెంగాల్ సీఎం మాట్లాడుతూ.. వీబీ జీ రామ్ జీ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 22 కోట్ల పనిదినాలను నమోదు చేసే దిశగా పనిచేస్తున్నామని అన్నారు. కేంద్రం ఇచ్చిన ఈ టార్గెట్‌ను తాము త్వరలోనే అందుకుంటామని ఆయన ధీమాగా చెప్పారు. అలాగే ఈ పథకం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.12,000 కోట్ల నిధులు కేటాయించాయని వివరించారు. ఇప్పటి వరకు బెంగాల్‌లో 65.62 లక్షల పని దినాలు నమోదు చేశామని వెల్లడించారు.

సిద్దు స్టింగ్ వీడియో కేసులో కుమారస్వామి సహాయకుడి విచారణ

కర్ణాటక :కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్యను లక్ష్యంగా చేసుకుంటూ స్టింగ్ వీడియోలను ప్రసారం చేసిన కేసులో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమార స్వామి కార్యాలయంతో సంబంధం ఉన్న మీడియా కన్సల్టెంట్ ప్రజ్వల్ ప్రసాద్‌ను బెంగళూరు సెంట్రల్ క్రైం బ్రాంచ్ (సీసీబీ) సైబర్ క్రైం పోలీసులు ప్రశ్నించారు. ప్రసాద్ మంగళవారం సీసీబీ ప్రధాన కార్యాలయానికి వచ్చి పోలీసుల ముందు హాజరయ్యాడు. విచారణకు హాజరు కావాలని పోలీసులు అంతకుముందు అతనికి నోటీసు పంపారు. ముందస్తు బెయిల్ పొందడానికి ముందు నిందితుడు తప్పించుకోవడంతో పోలీసులు ఆ నోటీసులు జారీ చేశారు. స్టింగ్ వీడియోల కేసులో ప్రసాద్ పాత్రతో పాటు అతని వెనుక ఎవరు ఉన్నారో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను ఢిల్లీలో కొన్నారని, అక్కడే కుమారస్వామి అధికారిక నివాసంలో ప్రసాద్‌కు ఆ ఫోన్ ఇచ్చారని బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు.



టెక్ రంగంలో భారత్ సరికొత్త రికార్డ్- 3 స్వదేశీ' ఏకా-1 మోడల్స్ ఆవిష్కరణ

ఢిల్లీ :కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించుకునే దిశగా భారత్ మరో కీలక అడుగు వేసింది. దేశీయ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన మూడు ఫౌండేషన్ ఏఐ మోడళ్లను కేంద్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియా-ఏఐ మిషన్ ఈ మోడళ్లను అభివృద్ధి చేయించింది. బెంగళూరుకు చెందిన సోకెట్ ఏఐ ల్యాబ్స్ రూపొందించిన 'ఏకా-1' జెన్‌టెక్యూ అభివృద్ధి చేసిన 'ధీర్-2బీ', 'ధీర్-5బీ' మోడళ్లను ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ విడుదల చేశారు. ఈ మోడళ్లు ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే మొబైల్ ఫోన్లలో పనిచేయగలగడం ప్రత్యేకత. డేటా భద్రతకు ప్రాధాన్యమిస్తూ, ప్రభుత్వ, రక్షణ, పారిశ్రామిక, విద్యా రంగాల్లో వీటిని ఉపయోగించవచ్చని అధికారులు తెలిపారు.సాధారణ ఏఐ సేవలతో పాటు ప్రత్యేక రంగాల్లోనూ ఉపయోగపడేలా వీటిని రూపొందించారు. గణితం, కోడింగ్, తార్కిక విశ్లేషణ, శాస్త్రీయ



పరిశోధన, సైబర్ భద్రత వంటి విభాగాల్లో ఇవి సహాయపడతాయని ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ తెలిపారు. ముఖ్యంగా ఇంటర్నెట్ కనెక్షన్ లేని ప్రాంతాల్లో, అత్యంత సున్నితమైన సమాచారంతో పనిచేసే సంస్థల్లో వీటిని వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. సాధారణంగా ఏఐ సేవలను ఉపయోగించాలంటే ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం. అయితే ఈ కొత్త మోడళ్లను నేరుగా మొబైల్ ఫోన్లలోనే అమలు చేయవచ్చు. దీనివల్ల వినియోగదారులు తమ సమాచారాన్ని ఆన్‌లైన్ సర్వర్లకు పంపించాల్సిన అవసరం ఉండదు. డేటా భద్రతకు ప్రాధాన్యమిచ్చే ప్రభుత్వ విభాగాలు, రక్షణ సంస్థలు, పరిశ్రమలకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేక అనువర్తనాల కోసం వీటిని సురక్షితమైన, ఇంటర్నెట్ అందుబాటులో లేని వాతావరణాల్లోనూ అమలు చేయవచ్చని వెల్లడించారు22 భారతీయ భాషల్లో ఏకా-1సోకెట్ ఏఐ ల్యాబ్స్ అభివృద్ధి చేసిన 'ఏకా-1' మోడల్ గణితం, కోడింగ్, రీజనింగ్ వంటి పనుల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఈ మోడల్ 26.3 బిలియన్ పారామీటర్లతో రూపొందింది. దీనికి 7.5 ట్రిలియన్ టోకెన్ల సమాచారంతో శిక్షణ ఇచ్చినట్లు సోకెట్ ఏఐ సీఈఓ అభిషేక్ ఉప్పర్వాల్ తెలిపారు.

ప్రేయసికి అంకితమైన అర్ష్‌దీప్ వికెట్ సంబరాలు!

- న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో ప్రత్యేక నృత్యంతో సందడి.. ప్రేయసి సమ్రీన్ కౌర్ కోసమేనని వెల్లడించిన భారత పేసర్



ఆక్లాండ్: భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ మైదానంలో చేసిన ఓ ప్రత్యేక సంబరం అభిమానులను ఆకట్టుకుంది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో వికెట్ తీసిన అనంతరం అతడు చేసిన వినూత్న నృత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ సంబరం వెనుక ఉన్న అసలు కారణాన్ని అర్ష్‌దీప్ స్వయంగా వెల్లడించడంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తన ప్రేయసి, నటి సమ్రీన్ కౌర్‌కు ఆ సంబరాన్ని అంకితం చేసినట్లు తెలిపాడు.**వికెట్ తీసి.. ప్రత్యేకంగా సంబరాలు**న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత బౌలర్లు అద్భుతంగా రాణించారు. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా కైల్ జేమీసన్‌ను ఔట్ చేసిన అనంతరం అర్ష్‌దీప్ మైదానంలో ప్రత్యేకమైన నృత్యంతో సంబరాలు చేసుకున్నాడు. అతడి వినూత్న హావభావాలు చూసి సహచర ఆటగాళ్లతోపాటు అభిమానులు కూడా ఆశ్చర్యపోయారు.**ప్రేయసి కోసమేనని వెల్లడి**తన సంబరాల వెనుక ఉన్న కారణాన్ని మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ వివరించాడు. తాను, తన ప్రేయసి బయటకు వెళ్లినప్పుడు సరదాగా చేసే నృత్య అడుగులనే మైదానంలో ప్రదర్శించినట్లు తెలిపాడు. ఇద్దరిలో ఎవరికైనా మానసికంగా ఉత్సాహం తగ్గినప్పుడు ఇలాంటి చిన్న చిన్న సంబరాలతో ఒకరినొకరు ఉత్సాహపరుచుకుంటామని చెప్పాడు. అందుకే ఈసారి వికెట్ తీసిన ఆనందాన్ని ఆమెకు అంకితం చేసినట్లు వెల్లడించాడు.**నాలుగు వికెట్లతో ఆకట్టుకున్న పేసర్**ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ తన బౌలింగ్‌తోనూ ఆకట్టుకున్నాడు. పది ఓవర్లలో 70 పరుగులిచ్చి నాలుగు వికెట్లు సాధించాడు. విల్ యంగ్, హెన్రీ నికోల్స్, కైల్ జేమీసన్, గ్లెన్ ఫిలిప్స్‌లను పెవిలియన్‌కు పంపాడు. అతడికి గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లు, అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లతో సహకరించారు. దీంతో న్యూజిలాండ్ జట్టు 40.2 ఓవర్లలో 185 పరుగులకే ఆలౌటైంది.**అభిమానుల్లో ఆసక్తి**అర్ష్‌దీప్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను మైదానంలో ప్రత్యేకంగా ప్రస్తావించడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. గతంలోనూ తన ప్రేయసి సమ్రీన్ కౌర్‌పై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన విమర్శలను అర్ష్‌దీప్ ఖండించాడు. వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలని అభిమానులకు సూచించాడు. తాజాగా మైదానంలో ఆమెకు ప్రత్యేకంగా సంబరాన్ని అంకితం చేయడంతో ఈ జంట మరోసారి వార్తల్లో నిలిచింది.క్రికెట్ మైదానంలో వికెట్ సాధించడం ఆటగాడికి ఆనందాన్ని ఇస్తుంది. ఆ ఆనందాన్ని తన జీవితంలో ప్రత్యేకమైన వ్యక్తితో పంచుకోవడం అర్ష్‌దీప్ సంబరానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఒకవైపు అద్భుతమైన బౌలింగ్‌తో జట్టుకు విజయావకాశాలు అందిస్తూనే, మరోవైపు తనదైన శైలిలో సంబరాలు చేసుకోవడం అభిమానులను ఆకట్టుకుంది. దీంతో అర్ష్‌దీప్ వికెట్ సంబరం మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ ప్రపంచ రికార్డు!

- మూడో స్థానంలో 13 వేల పరుగుల మైలురాయి.. ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించిన కింగ్ కోహ్లీ



ఆక్లాండ్: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 13 వేల పరుగులు పూర్తి చేసిన ప్రపంచంలోనే తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన తొలి వన్డేలో ఈ ఘనత సాధించాడు. ఇప్పటికే ఎన్నో రికార్డులను తన పేరిట లిఖించుకున్న కోహ్లీ, తాజాగా మరో మైలురాయిని అందుకుని తన ప్రత్యేకతను చాటుకున్నాడు.**12 పరుగులతో చరిత్రలోకి..** ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా భారత్-న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే జరిగింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ నిర్దేశించిన 186 పరుగుల లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీకి ఈ అరుదైన రికార్డును అందుకునే అవకాశం వచ్చింది. మ్యాచ్‌కు ముందు మూడో స్థానంలో 13 వేల పరుగులు పూర్తి చేయడానికి అతడికి మరో 12 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులోకి వచ్చిన కోహ్లీ తాను ఎదుర్కొన్న 13వ బంతికి 12వ పరుగు సాధించడంతో చారిత్రక మైలురాయిని చేరుకున్నాడు. దీంతో వన్డే క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు.**పాంటింగ్ రికార్డును అధిగమించిన కోహ్లీ**వన్డేల్లో మూడో స్థానంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ రెండో స్థానంలో ఉన్నాడు. పాంటింగ్ తన కెరీర్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 12,662 పరుగులు సాధించాడు. కోహ్లీ తాజాగా 13 వేల పరుగుల మార్కును అందుకోవడంతో అతడి కంటే ముందంజలో నిలిచాడు. శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర 9,747 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో కోహ్లీ, పాంటింగ్ మాత్రమే 10 వేల పరుగుల మార్కును దాటడం విశేషం.**నిలకడకు నిదర్శనం కోహ్లీ ప్రస్థానం**వన్డే క్రికెట్‌లో మూడో స్థానం అత్యంత కీలకమైన బ్యాటింగ్ స్థానంగా భావిస్తారు. ప్రారంభంలో వికెట్లు త్వరగా పడితే ఇన్నింగ్స్‌ను నిలబెట్టాల్సి ఉంటుంది. ఓపెనర్లు మంచి ఆరంభం ఇస్తే పరుగుల వేగాన్ని పెంచాల్సి ఉంటుంది. ఈ రెండు బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ కోహ్లీ ఎన్నో సంవత్సరాలుగా భారత జట్టుకు అండగా నిలుస్తున్నాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడటం, లక్ష్య ఛేదనలో బాధ్యత తీసుకోవడం అతడి ప్రత్యేకతగా నిలిచాయి. ఈ క్రమంలోనే మూడో స్థానంలో 13 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు.**శతకాలు, అర్ధశతకాలతో ప్రత్యేక గుర్తింపు** మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ కోహ్లీ 48 సెంచరీలు, 69 అర్ధసెంచరీలు సాధించాడు. అతడి సగటు కూడా 61కు పైగా ఉండటం విశేషం. అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలోనూ సచిన్ టెండూల్కర్ తర్వాతి స్థానంలో కోహ్లీ కొనసాగుతున్నాడు. ప్రతి మ్యాచ్‌లోనూ కొత్త రికార్డుల దిశగా సాగుతున్న అతడి ప్రస్థానం భారత క్రికెట్ అభిమానులకు ప్రత్యేక ఆనందాన్ని అందిస్తోంది.**సచిన్ రికార్డుపై కన్ను**వన్డే క్రికెట్‌లో ఒక నిర్దిష్ట బ్యాటింగ్ స్థానంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సచిన్ 15,310 పరుగులు సాధించాడు. ఇప్పుడు మూడో స్థానంలో 13 వేల పరుగులు పూర్తి చేసిన కోహ్లీ, ఈ అరుదైన ఘనతతో మరోసారి ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించాడు. భవిష్యత్తులో మరిన్ని మైలురాళ్లను చేరుకునే అవకాశం అతడికి ఉంది.రికార్డులు సృష్టించడం ఒక ఎత్తయితే.. వాటిని నిలకడైన ప్రదర్శనతో అందుకోవడం మరో ఎత్తు. విరాట్ కోహ్లీ ప్రస్థానం ఈ విషయాన్ని నిరూపిస్తోంది. జట్టుకు అవసరమైన సమయంలో బాధ్యత తీసుకుంటూ, పరుగుల వేటలో తనదైన ముద్ర వేస్తున్నాడు. వయసుతో సంబంధం లేకుండా ఆటపై అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగుతున్నాడు. మూడో స్థానంలో 13 వేల పరుగుల ప్రపంచ రికార్డు కోహ్లీ వ్యక్తిగత ఘనత మాత్రమే కాదు.. భారత క్రికెట్ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిపోనుంది.

స్లెడ్జింగ్‌తో రెచ్చగొట్టి.. వికెట్‌తో బదులిచ్చిన గుర్నూర్ బ్రార్!



- బ్లెయిర్ టిక్నర్‌తో మాటల యుద్ధం.. మరుసటి బంతికే పెవిలియన్‌కు పంపిన భారత యువ పేసర్.. వైరల్‌గా మారిన వీడియో

ఆక్లాండ్: భారత్-న్యూజిలాండ్ మధ్య జరిగిన తొలి వన్డేలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. భారత యువ పేసర్ గుర్నూర్ బ్రార్, న్యూజిలాండ్ బ్యాటర్ బ్లెయిర్ టిక్నర్ మధ్య మైదానంలో జరిగిన మాటల యుద్ధం అభిమానులను ఆకట్టుకుంది. ప్రత్యర్థి బ్యాటర్‌ను మాటలతో రెచ్చగొట్టిన గుర్నూర్.. మరుసటి బంతికే వికెట్ తీసి తన సత్తా చాటాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.**మాటల యుద్ధానికి తెరలేపిన గుర్నూర్** న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 41వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. అప్పటికే చివరి వికెట్ కోసం భారత బౌలర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. క్రీజులో ఉన్న బ్లెయిర్ టిక్నర్ దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ భారత బౌలర్లకు సవాల్ విసురుతున్నాడు. ఈ క్రమంలో గుర్నూర్ వేసిన బౌన్సర్‌ను టిక్నర్ సరిగ్గా ఆడలేకపోయాడు. దీంతో గుర్నూర్ పుల్ షాట్ ఎలా ఆడాలో చేతులతో సైగలు చేస్తూ టిక్నర్‌ను ఆటపట్టించాడు.**తగ్గేదేలే అన్న టిక్నర్.. బౌలర్‌కు సవాల్** గుర్నూర్ సైగలకు టిక్నర్ కూడా ధీటుగా స్పందించాడు. వికెట్లను లక్ష్యంగా చేసుకుని బంతులు వేయాలని బౌలర్‌కు సూచిస్తూ బదులిచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు సరదా మాటల యుద్ధం సాగింది. అయితే గుర్నూర్ మాత్రం మాటలకే పరిమితం కాకుండా బంతితో సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నాడు.**మరుసటి బంతికే వికెట్.. సంబరాల్లో గుర్నూర్** టిక్నర్‌కు గుర్నూర్ వేసిన తర్వాతి బంతి కూడా షార్ట్ పిచ్‌గానే వచ్చింది. దాన్ని పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన టిక్నర్ బ్యాట్ అంచుకు తగిలించడంతో బంతి వికెట్ల వెనుకకు వెళ్లింది. అప్రమత్తంగా ఉన్న వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ క్యాచ్ అందుకోవడంతో టిక్నర్ ఇన్నింగ్స్ ముగిసింది. వెంటనే గుర్నూర్ సంబరాలు చేసుకున్నాడు. టిక్నర్ కూడా చిరునవ్వుతో మైదానాన్ని వీడటం క్రీడాస్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది.**నాలుగు సిక్సర్లతో టిక్నర్ పోరాటం** ఈ మ్యాచ్‌లో టిక్నర్ చివరి వికెట్‌గా వచ్చి భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 23 బంతుల్లో 34 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఒక ఫోర్, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. జాకబ్ డఫీతో కలిసి చివరి వికెట్‌కు 39 పరుగులు జోడించి న్యూజిలాండ్ స్కోరును పెంచాడు. వన్డేల్లో 11వ స్థానంలో బ్యాటింగ్ చేస్తూ ఒక ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో మహమ్మద్ అమీర్, నసీమ్ షాలతో కలిసి టిక్నర్ నిలిచాడు.**మూడు వికెట్లతో గుర్నూర్ ప్రతిభ** ఈ మ్యాచ్‌లో గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లు పడగొట్టి భారత బౌలింగ్‌లో కీలక పాత్ర పోషించాడు. అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లతో రాణించగా, అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లు సాధించాడు. భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది.క్రికెట్‌లో మాటల యుద్ధాలు కొత్తేమీ కాదు. అయితే ప్రత్యర్థి ఆటగాడి సవాళ్లకు మాటలతో కాకుండా ఆటతో సమాధానం చెప్పడం ప్రత్యేకత. గుర్నూర్ బ్రార్ అదే చేసి చూపించాడు. స్లెడ్జింగ్ తర్వాతి బంతికే వికెట్ సాధించడం మ్యాచ్‌లో ఆసక్తికర ఘట్టంగా నిలిచింది. మరోవైపు చివరి వికెట్‌గా వచ్చి టిక్నర్ చేసిన పోరాటం కూడా అభిమానులను ఆకట్టుకుంది. ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగిన ఈ సరదా పోటీ ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.

న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం



- విరాట్ కోహ్లీ మెరుపు ఇన్నింగ్స్.. 74 పరుగులతో జట్టుకు అండ.. ఐదు వికెట్ల తేడాతో తొలి వన్డే కైవసం

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత భారత బౌలర్లు అద్భుతంగా రాణించి న్యూజిలాండ్‌ను 185 పరుగులకే కట్టడి చేయగా, లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ 74 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 37 పరుగులతో రాణించడంతో భారత్ విజయం దిశగా సాగింది. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ విధానంలో లక్ష్యాన్ని 143 పరుగులకు కుదించగా, భారత్ ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. **బౌలర్ల విజృంభణ.. 185 పరుగులకే కివీస్ ఆలౌట్** టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత యువ పేసర్లు అద్భుత ప్రదర్శనతో న్యూజిలాండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టి సత్తా చాటగా, గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లు సాధించాడు. దీంతో న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. టిమ్ సీఫర్ట్ 38, బ్లెయిర్ టిక్నర్ 34 పరుగులతో రాణించారు.**కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్.. గిల్‌తో కీలక భాగస్వామ్యం** 186 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి రెండో వికెట్‌కు 114 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కోహ్లీ బౌండరీలతో అలరిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.**51 బంతుల్లో 74 పరుగులు** విరాట్ కోహ్లీ కేవలం 51 బంతుల్లో 74 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. మరోవైపు గిల్ 56 బంతుల్లో 37 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. వర్షం కారణంగా పలుమార్లు ఆటకు అంతరాయం ఏర్పడటంతో డక్‌వర్త్ లూయిస్ విధానంలో భారత్ లక్ష్యాన్ని 143 పరుగులకు కుదించారు.**సిరీస్‌లో భారత్‌కు శుభారంభం** చివరకు భారత్ 22.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 143 పరుగులు సాధించింది. దీంతో ఐదు వికెట్ల తేడాతో విజయం అందుకుంది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో తొలి వన్డేలో జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. ముఖ్యంగా యువ పేసర్ల ప్రదర్శన, కోహ్లీ బ్యాటింగ్ అభిమానులను ఆకట్టుకున్నాయి.వన్డే సిరీస్‌ను విజయంతో ప్రారంభించిన భారత్ రెండో మ్యాచ్‌లోనూ ఇదే జోరు కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. యువ బౌలర్లకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం, కోహ్లీ తన అనుభవంతో జట్టును విజయతీరాలకు చేర్చడం భారత జట్టుకు సానుకూల పరిణామాలు.

నా అభిమాన కెప్టెన్లు వారే!

సచిన్ మనసులో గంగూలీ, ధోనీకి ప్రత్యేక స్థానం



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనకు ఇష్టమైన కెప్టెన్ల పేర్లను వెల్లడించాడు. సౌరవ్ గంగూలీ, మహేంద్రసింగ్ ధోనీ తన అభిమాన కెప్టెన్లని తెలిపాడు. తాజాగా అభిమానులతో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు సచిన్ ఈ సమాధానమిచ్చాడు.భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవమని సచిన్ పేర్కొన్నాడు. అలాగే దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా నాయకత్వాన్ని ప్రశంసించాడు. జట్టును ముందుండి నడిపిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నాడని కొనియాడాడు.

రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీలకు కీలక అవకాశం!

సూపర్‌స్టార్ సరసన తొలిసారి.. ప్రత్యేక గ్లింప్స్‌తో పరిచయం చేసిన చిత్రబృందం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ చిత్రం 'ధర్మన్'లో యువ కథానాయిక శ్రీలీల చేరారు. ఈ విషయాన్ని ప్రముఖ నటుడు, నిర్మాత కమల్‌హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది. శ్రీలీలకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. 'ఆమెలో ప్రత్యేకమైన మెరుపు ఉంది.. అద్భుతమైన ఉత్సాహం ఉంది' అంటూ చిత్రబృందం ఆమెను పరిచయం చేసింది. ఈ చిత్రంలో శ్రీలీల పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.రజనీకాంత్, శ్రీలీల కలిసి నటించడం ఇదే తొలిసారి. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' చిత్రాలతో గుర్తింపు పొందిన అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ చిత్రంలో రజనీకాంత్ వైద్యుడి పాత్రలో కనిపించనున్నారు. అయితే ఆయన పాత్రలో మరో కోణం కూడా ఉంటుందని ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆసక్తిని పెంచుతున్నాయి. వైద్యుడిగా ఉంటూనే నేరగాళ్లపై పోరాడే పాత్రలో సూపర్‌స్టార్ కనిపించనున్నట్లు సమాచారం.ఈ సినిమాలో నయనతార, సిమ్రన్, రాశీఖన్నా, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. నికేత్ బొమ్మి ఛాయాగ్రహణం, ప్రదీప్ ఈ రాఘవ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.ఇప్పటికే మూడు విడతల చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'ధర్మన్' ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌కు చేరుకుంటోంది. ఈ చిత్రానికి విడుదల తేదీని నిర్మాతలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. శ్రీలీల చేరికతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



పెద్దలు కూడా పిల్లల్లా ఎంజాయ్ చేస్తారు!

నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు 'సమ్మర్ హాలిడేస్'.. ప్రీ రిలీజ్ వేడుకలో చిత్రబృందం

పిల్లలతో పాటు పెద్దలను కూడా తమ బాల్య జ్ఞాపకాలలోకి తీసుకెళ్లే కథాంశంతో రూపొందిన చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని తన సొంత నిర్మాణ సంస్థ ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర్ దర్శకత్వం వహిస్తుండగా, మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 6న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు నిర్మాత అల్లు అరవింద్, హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నటి జయసుధ మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను అమ్మమ్మ పాత్రలో నటించానని తెలిపారు. ఇది కేవలం పిల్లల సినిమా కాదని, తల్లిదండ్రులు, అమ్మమ్మ, వేసవి సెలవుల నేపథ్యంలో అందరికీ అనుబంధం కలిగించే కథ అని చెప్పారు. ఇలాంటి మంచి చిత్రాలను నిర్మాత ధీరజ్ మరిన్ని నిర్మించాలని ఆకాంక్షించారు.



'కింగ్ 100'లో మహంతి ఝాన్సీ రాణిగా టబు!


- 28 ఏళ్ల తర్వాత నాగార్జున, టబు కలిసి నటిస్తున్న చిత్రం.. డిసెంబర్ 24న విడుదల

అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంగా 'కింగ్ 100'లో నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ సినిమాకు రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది.నటి టబు పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమె పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె లిలిమహంతి ఝాన్సీ రాణిలిలిగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. 'ఈ ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉంటారు. లక్‌ను నమ్మేవాళ్లు ఒకరు.. కష్టాన్ని నమ్మేవాళ్లు మరొకరు. ఐ హేట్ లక్' అనే డైలాగ్‌తో ఆమె పాత్రను పరిచయం చేశారు.దాదాపు 28 ఏళ్ల తర్వాత నాగార్జున, టబు మరోసారి వెండితెరపై కలిసి నటిస్తున్నారు. గతంలో ప్రేమకథల్లో అలరించిన ఈ జంట ఈసారి యుద్ధ నేపథ్యంతో సాగే కథలో కనిపించనుండటం విశేషం.

రూ.వెయ్యి కోట్ల డీల్‌తో 'ఇట్లు అర్జున' ట్రైలర్ ఆసక్తికరం!

- ఎన్టీఆర్ విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్.. నవంబర్ 13న సినిమా ప్రేక్షకుల ముందుకు

అక్కినేని నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న 'ఇట్లు అర్జున' చిత్రంతో కొత్త హీరో అనీష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకీ కుడుముల నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను యంగ్ టైగర్ ఎన్టీఆర్ విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ట్రైలర్ పోలీసుల వేటతో ప్రారంభమవుతుంది. ఓ దొంగను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తుండగా, అర్జున్ అనే మూగ యువకుడు కథలోకి ప్రవేశిస్తాడు. మాట్లాడలేకపోయినా అసాధారణ తెలివితేటలు కలిగిన అర్జున్.. కీర్తిని ప్రేమిస్తుంటాడు. అయితే అనూహ్యంగా ఈ జంట ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకుంటుంది. పోలీసులు, గూండాల ముఠా వారి కోసం గాలిస్తుంటారు.ఓ మిస్టరీ పెన్‌డ్రైవ్, దాని వెనుక ఉన్న రూ.వెయ్యి కోట్ల డీల్ కథలో ఉత్కంఠను పెంచుతున్నాయి. తొలి సినిమాతోనే భిన్నమైన కథను ఎంచుకున్న అనీష్‌ను ఎన్టీఆర్ అభినందించారు. ఈ చిత్రం నవంబర్ 13న విడుదల కానుంది.



ధనుష్ 'ఓం' తెలుగు రాష్ట్రాల విడుదల హక్కులు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు!

నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు చిత్రం.. భారీ తారాగణంతో యాక్షన్ డ్రామా



తమిళ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'ఓం' తెలుగు రాష్ట్రాల విడుదల బాధ్యతలను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ దక్కించుకుంది. నిర్మాత నాగవంశీ ఆధ్వర్యంలోని ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సినిమాను విడుదల చేయనుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అమరన్' చిత్రంతో గుర్తింపు పొందిన రాజ్‌కుమార్ పెరియసామి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్‌తో పాటు మలయాళ స్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో నటిస్తున్నారు. సాయిపల్లవి, శ్రీలీల కథానాయికలుగా కనిపించనుండగా, బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా, ఇంద్రన్స్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అడవుల్లో ఎర్రచందనం కోసం పనిచేసే కూలీలు, పోలీసుల మధ్య చోటుచేసుకునే పరిణామాలు కథలో ప్రధానంగా ఉండనున్నాయి. ధనుష్ ఇందులో ఎర్ర చందనం కూలీ పాత్రలో కనిపించనున్నారు. వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయు క్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. తెలుగు రాష్ట్రా ల్లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల బాధ్యత లు చేపట్టడంతో సినిమాకు భారీ స్థాయిలో థియేటర్లు ల భించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.